ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
3
శుక్రవారం 20 సెప్టెంబరు 2024



చేవూరుపాలెం పాఠశాలలో కుళ్లిన కోడిగ్రుడ్లు

మధ్యాహ్న భోజనంలో కుళ్లిన గుడ్లు

చేవూరుపాలెం ఎలిమెంటరీ పాఠశాలను సందర్శించిన సర్పంచ్, ఎస్‌ఎంసీ చైర్మన్

అధికారుల దృష్టికి విషయం

ముదినేపల్లి, సెప్టెంబరు 19 : ముదినేపల్లి మండలం శ్రీహరిపురం పంచాయతీ ఏరియాలోని చేవూరుపాలెం ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనంలో కుళ్లిన గుడ్లు గురువారం బయటపడ్డాయి. సర్పంచ్ పరసా విశ్వేశ్వర రావు, ఎస్‌ఎంసీ చైర్మన్ అంజలీదేవి, పంచాయతీ కార్యదర్శి వెంకట అప్పారావు పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం మెనూను, సరఫరా అవుతున్న గుడ్లను తనిఖీ చేయగా కుళ్లిన గుడ్లు బయట పడ్డాయి. గుడ్లను ఉడక పెట్టిపై పొర తీసేయగా, లోపలి సొనతో సహా కుళ్లిపోయి కనిపించాయి. వెంటనే సర్పంచ్ విశ్వేశ్వర రావు, ఎంఈవో-1, ఎంఈ వో-2 సేవ్యా నాయక్, నరేష్ కుమార్‌లకు ఫోన్ చేసి విషయం తెలిపారు. కుళ్లిన గుడ్లు వస్తుంటే ఏం చేస్తున్నారని నిలదీయగా, తాము విచారించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కాంట్రాక్టర్‌కు సర్పంచ్ ఫోన్ చేసి అడగా సరైన సమాధానం చెప్పలేదు. కుళ్లిన గుడ్లను పారేశారు. ప్రతీ పాఠశాలలోను, అంగన్‌వాడీ కేంద్రాల్లోను గుడ్లను తనిఖీ చేయాలని విశ్వేశ్వరరావు డిమాండ్ చేశారు.

మండలం అంతా ఇంతే..

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో కుళ్లిన గుడ్లు సరఫరా అవుతున్న ఘటనలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. రెండు నెలలుగా ముదినేపల్లి మండలంలోని పలు పాఠశా లలకు సరఫరా అయిన కోడిగుడ్లు కుళ్లిపోయి విద్యా ర్థులకు పెట్టేందుకు పనికి రాకుండాపోయాయి. వారానికి ఒకసారి కాంట్రాక్టర్ పాఠశాలలకు సరఫరా చేస్తున్న గుడ్లు వండే ముందు నీళ్లలో వేస్తే పాడై పోయిన గుడ్లు పైకి తేలిపోతాయి. అయినా కొన్ని పాఠశాలల్లో వాటినే వినియోగించేస్తున్నారు. కుళ్లిన కోడిగుడ్లను విద్యార్థులకు వండి పెడితే అనారోగ్యాల పాలవుతారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలలను తర చూ తనిఖీ చేసి నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని చెప్పడమే తప్ప కోడిగుడ్ల నాణ్యతను పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.



గ్రాండ్‌గా.. బ్రాండ్‌లు!

కూటమి ప్రభుత్వ నూతన మద్యం పాలసీ

అందరూ ఊహించినట్టుగానే.. కూటమి ప్రభుత్వాన్ని కోరుకున్నట్టుగానే ఇకముందు గ్రాండ్‌గా బ్రాండ్‌లన్నింటని అందుబాటులోకి తేవాలని, నాణ్యమైన మద్యంను మాత్రమే అందించాలని రాష్ట్ర ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుంది. నూతన మద్యం విధానానికి రాష్ట్ర మంత్రివర్గం తాజాగా ఆమోదించింది. ఇకముందు క్వార్టర్ మద్యం ధర రూ.99లకే అందు బాటులోకి తెస్తున్నట్టు మద్యం ప్రియు లకు తీపి కబురు అందించింది. జిల్లాల వారీగా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి వీటి ద్వారానే మద్యం దుకాణాల ఏర్పాటు, సంఖ్య నిర్దేశించడంతోపాటు వేలం ద్వారా దుకాణాన్ని కేటాయించే విధానానికి పచ్చజెండా ఊపింది. ఇన్నాళ్ళు గత ప్రభుత్వం దురాలోచనలతో ఇష్టం వచ్చినట్టు బ్రాండ్‌లు జనంపై రుద్ది సొమ్ము చేసుకుంది.

- ఇక క్వార్టర్ రూ.99కే
- జనాభా ప్రాతిపదికన దుకాణాలు
- జిల్లాలో గతం కంటే అదనపు షాపులు
- దుకాణాల కోసం వేట ?

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

రోజూ కాయకష్టం చేసేవారిలో అత్యధికులు కాస్తంత పొద్దెక్కిన వెంటనే మద్యం కోరుకుంటారు. గత ఐదేళ్ల పాటు ఈ తరహా వర్గాలను వైసీపీ వదిలిపెట్టలేదు. తాజాగా కొత్త మద్యం విధానంలో ఈ తరహా వర్గానికి కొంత కలిసొచ్చేలా మంత్రివర్గం నిర్ణయాలు తీసుకుంది. క్వార్టర్ ఒక్కింటికి రూ.99 చొప్పున ధర నిర్దేశించింది. ఇంతకుముందు ఈ వర్గాలన్నింటికి రూ.110-130 చొప్పున కొన్ని చీప్ బ్రాండ్‌లను అందుబాటులో ఉంచేవారు. అలాంటి మద్యం తాగిన వారంతా అనారోగ్యం పాలయ్యారు. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంకొంతమంది ఆస్పత్రులపాలయ్యారు. కేవలం తమకు 2014-19 మధ్య ఏ మద్యం అయితే విక్రయించారో తిరిగి ఆ తరహా మద్యాన్నే అందుబాటులోకి తేవాలని మద్యం ప్రియులు గట్టిగా ఒత్తిడి తేవడం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం కూడా ముందుగా ఈ వర్గం ఆశించినట్టుగానే కసరత్తు ఆరంభించి ధరతోపాటు వారు కోరుకుంటున్న బ్రాండ్‌లనే అందుబాటులోకి తేవాలని ఆ దిశగానే అడుగులు వేస్తోంది.

లోపాయికారి ఒప్పందాలు ..

మద్యం పాలసీ ప్రకటించడంతో ఎక్కడికక్కడ ఎక్కువ మంది మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే కొందరు రాత్రివేళల్లో సిట్టింగ్‌లకు దిగుతున్నారు. ప్రత్యేకించి మాకొస్తే మీకు.. మీకొస్తే మాకు ఆ నిష్పత్తిలో వాటాలు పంచుకునేందుకు ఇంకొందరు ఎత్తుగడలకు దిగుతున్నారు. కూటమిలో ఇప్పటికే ఈ రంగంలో ఆరితేరిన వారంతా ఎట్టి పరిస్థితుల్లో తాము కోరుకున్న దుకాణాల వైపు వేరెవ్వరూ తొంగిచూడకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇప్పుడు ఈ టెన్షనే అందరిలోనూ ఉంది.

జనాభాను బట్టి దుకాణాలు

జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు ఎన్ని ఉండాలనే అంశంపై జనాభా ప్రాతిపదిక మేరకే సంఖ్య నిర్దేశించాలని తాజాగా నిర్ణయించారు. ఇప్పటి ఏలూరు జిల్లా పరిధిలో చింతలపూడి, పోలవరం, ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాలు ఉండగా గతంలో వీటిలో దాదాపు 120-130 మధ్యలో మద్యం దుకాణాలను వైసీపీ ప్రభుత్వం నిర్వహిస్తూ వచ్చింది. ఇప్పుడు ఆ సంఖ్య మరో పాతికకు పైగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇంతకుముందు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానే కార్యకలాపాలు జరగ్గా ఎప్పుడైతే విభజిత జిల్లాలుగా మారిపోయిందో ఎక్కడికక్కడ మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలకు కసరత్తు జరుగుతోంది. నేడో, రేపో ఆ మేరకు వెలువడే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా జగన్ ప్రభుత్వ హయాంలో దాదాపు 3,736 మద్యం దుకాణాలు కొనసాగాయి. ఇప్పుడు ఆ సంఖ్య మరింత పెరిగి జిల్లాల్లోను అదే తరహా ప్రభావం పడనుంది. జిల్లాలో మద్యం దుకాణాల సంఖ్య 175 వరకు ఉండవచ్చని అంచనా. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం దుకాణాల్లో పది శాతం దుకాణాలను గీత కార్మికులకు ఇవ్వాలని నిర్ణయించడంతో ఆ వర్గానికి చెందిన వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాము ఎన్నికలకు ముందే పార్టీ అధినేత చంద్రబాబును కలిసి గీత కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలు, నష్టాలను వివరించామని, ఇప్పుడు మద్యం దుకాణాల కేటాయింపులో మొత్తం మీద పది శాతం ఈ వర్గానికి ఇవ్వాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం హర్షదాయకమని టీడీపీ నేత శ్యామ్ చంద్రశేషు పేర్కొన్నారు. దీంతోపాటు రిజర్వుడు మద్యం షాపుల్లో లైసెన్సు ఫీజును సగానికి సగం తగ్గించనున్నారు.

అందరికీ సంతృప్తిగా..

మద్యం ప్రియుల్లో ఏ ఒక్కరూ అసంతృప్తికి గురికాకుండా ధరల విషయంలో పెద్ద ఎత్తున మార్పులు, చేర్పులు చోటు చేసుకోబోతున్నాయి. ఇప్పటికే వివిధ బ్రాండ్‌లు తిరిగి బహిరంగ మార్కెట్‌లో అందుబాటులోకి రానున్నాయి. అయితే గతంలో ఉన్నధరల కంటే ఈసారి వాటి ధరలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకించి ఈసారి అమ్మకాలు రెట్టింపు జరుగుతాయనే భావనే అన్నిచోట్ల వినిపిస్తోంది. ప్రత్యేకించి ఇంతకుముందు ధరలను రెట్టింపు చేసి ఎడాపెడా అమ్మకాలు సాగించిన చీప్‌లిక్కర్ ధర అమాంతం తగ్గిస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో ధర కంటే రూ.31లు మేర తగ్గించి విక్రయించాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి దాకా ఉన్న సమాచారం ప్రకారం మద్యం దుకాణాల వేలం పాట పూర్తికావడానికి, కొత్త దుకాణాలు తెరుచుకోవడానికి అక్టోబరు మొదటి వారం చివరికి వచ్చే అవకాశాలు లేక పోలేదని అంచనా. ఎలాగూ సెబ్ రద్దయ్యి ఎక్సైజ్‌శాఖకు పూనర్వైభవం రావడం, ఈనెల 30వ తేదీలోపు ఎక్సైజ్ బదిలీలు పూర్తికావాల్సి ఉండడంతో అక్టోబరు 1వ తేదీనే కొత్తగా దుకాణాలు తెరుచుకోవడం అసాధ్యమే. కాబట్టి వారం లేదా పది రోజుల్లో ఈ వ్యవహారాన్నంతటిని ముగించి కొత్త విధానం అమలులోకి తేవాలని భావిస్తున్నారు.

మరో ఇద్దరు కార్పొరేటర్లు వైసీపీకి రాజీనామా

ఏలూరు రూరల్, సెప్టెంబరు 19 : ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత వైసీపీకి షాకుల మీద షాకులు తగులుతున్నాయి.కొంతమంది ముఖ్యనేతలు తమ పదవులకు రాజీనామాలు చేస్తుంటే ద్వితీయ శ్రేణి నాయకులు పక్క చూపులు చూస్తున్నారు. ముఖ్యంగా ఏలూరు కార్పొరేషన్‌లో గెలుపొందిన కార్పొరేటర్లు అధికార పార్టీలోకి ఫిరాయిస్తున్నారు. తాజాగా ఏలూరు వైసీపీకి మరో షాక్ తగిలింది. మరో ఇద్దరు కార్పొరేటర్లు వైసీపీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావుకు పంపించారు. ఏలూరు 11వ డివిజన్ కార్పొరేటర్ కోయ జయగంగ, 27వ డివిజన్ కార్పొరేటర్ బత్తిన విజయ కుమార్ వైసీపీకి రాజీనామా చేసినట్టు ప్రకటించారు. కార్పొరేటర్ జయగంగా భర్త సత్యనారాయణ పార్టీ నగర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆయన కూడా పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

మరోదఫా మెడికల్ లీవులో మునిసిపల్ టీచర్లు ?

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 19 : నిబంధనలకు విరుద్ధంగా తమను పంచాయతీరాజ్ పాఠశాలలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద సర్దుబాటు చేశారంటూ ఏలూరు నగరపాలక సంస్థకు చెందిన 11 మంది టీచర్లు కోర్టుని ఆశ్రయించారు. దీనిపై తదుపరి విచారణను నాలుగు వారాలకు కోర్టు వాయిదా వేయగా, ఇప్పటివరకు సంబంధిత సర్‌ప్లస్ ఉపాధ్యాయులకు కేటాయించిన తాత్కాలిక స్థానాల్లో విధులు చేపట్టకుండా పలువురు మెడికల్ లీవ్‌లో వున్న విషయం విదితమే. అయితే వీరికి మెడికల్ లీవు గడువు గురువారంతో ముగియగా, శుక్రవారం సంబంధిత నూతన స్థానాల్లో విధుల్లో చేరాల్సిన తప్పనిపరిస్థితులు సాంకేతికంగా నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఒకరోజు విధులకు హాజరై, మళ్ళీ మెడికల్ లీవుపై కొందరు టీచర్లు వెళ్లనున్నట్టు సమాచారం. దీనిపై తమవద్ద ఎటువంటి అధికారిక సమాచారం లేదని విద్యాశాఖవర్గాలు వెల్లడించాయి.

తమ్ముడి భార్యపై కన్నేసిన అన్న

- ద్రౌపదికి ఐదుగురు లేరా..? సర్దుకు పోవాలంటూ చిన్న కోడలికి అత్త హితవు
- లొంగకపోయే సరికి తమ్ముడు, మరదలిపై దాడి

5

కొనసాగుతున్న పీహెచ్‌సీల వైద్యాధికారుల సమ్మె

పల్లెల్లో పడకేసిన వైద్యసేవలు



- వైరల్ జ్వరాలు, అంటురోగాల భయాందోళనలు
- తమ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన విరమించేది లేదంటున్న డాక్టర్లు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించని వైద్య ఆరోగ్యశాఖ

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 19 : పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో ఇన్‌సర్వీస్ రిజర్వేషన్లను పాత విధానం ప్రకారమే ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న ఎంబీబీఎస్ వైద్యాధికారులకు కొనసాగించాలని జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల డాక్టర్లు కొద్ది రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మె గురువారం కొనసాగింది. జిల్లాలో మొత్తం 62 రూరల్ పీహెచ్‌సీలు, 18 అర్బన్ పీహెచ్‌సీ (హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు)లు ఉండగా, సమ్మెలో గ్రామీణ ప్రాంత పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొంటున్నారు. మొత్తం 130 మంది వైద్యాధికారుల్లో గురువారం 36 మంది మాత్రమే విధులకు హాజరు కాగా, మిగతా వారంతా గైర్హాజరులో ఉన్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట వెల్లడించారు. గ్రామీణ ప్రాంత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు కేవలం స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులతోనే వైద్య సేవలు అందిస్తున్నట్టు స్పష్టమవుతోంది. ప్రస్తుతం జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు, వరదలు, కొల్లేరుప్రాంతంలో ముంపుగ్రామాల ప్రజలు బాధితులుగా వున్న విషయం విదితమే. మరోవైపు డెంగీ, చికున్‌గున్యా, మలేరియా తదితర వైరల్ జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలుతున్నట్టు క్షేత్రస్థాయి నుంచి కొన్నిచోట్ల సమాచారం అందుతోంది. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీల వైద్యాధికారులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మె కారణంగా పల్లెప్రాంతాల్లో వైద్యసేవలకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అత్యవసర చర్యలు తీసుకోవాల్సిన వైద్యఆరోగ్యశాఖ ఇంతవరకు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. అవసరమైతే ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)ను సంప్రదించి వైద్యసేవలకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే డాక్టర్లతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయవచ్చని చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు వైద్యసేవలు, రోగ నిర్ధారణ పరీక్షలు, మందులు అందించేందుకు ఉద్దేశించిన 104 సర్వీసులపైనా సమ్మె ప్రభావం కనబడుతోంది. ఆయా రోగాలతో సతమతమ వుతున్న వారికి సరైన వైద్య సలహాలు ఇవ్వడానికి 104 సంచార వైద్యశాలల్లో డాక్టర్లు లేకుండానే వాహనాలను పల్లెల్లో వినియోగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఎవరేమంటున్నారంటే..

- 'సమ్మెపై నాకు ఎటువంటి సమాచారం లేదు. గురువారం జిల్లాలో మొత్తం 92 మంది పీహెచ్‌సీల వైద్యాధికారులు విధులకు రాలేదు. పీహెచ్‌సీల్లో కేవలం ప్రైమరీ హెల్త్‌కేర్ వైద్యసేవలు మాత్రమే అందు బాటులో ఉంటాయి కనుక ఈ వైద్యసేవలను అక్కడుండే స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టులు చేస్తారు. అవసరమైతే రోగులను సీహెచ్‌సీలకు రిఫర్ చేస్తారు.'
  - డాక్టర్ శర్మిష్ట, డీఎంహెచ్‌వో.
- 'జిల్లాలో 104 సేవలందించే సంచార వైద్యశాలలు 41 ఉన్నాయి. డాక్టర్ల సమ్మెవల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల రోగనిర్ధారణ పరీక్షలు, మందులు ఇస్తున్నాం. ఒక్కో పీహెచ్‌సీకి ఇద్దరు వంతున వైద్యాధికారులు ఉన్నందున వీరిలో ఒకరు 104 సంచారవైద్యశాల విధులకు హాజరవుతున్నారు.'
  - విజయ్, 104 సంచారవైద్యశాలల జిల్లా మేనేజర్.
- 'ఇన్‌సర్వీస్ రిజర్వేషన్ల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం గురువారం ఎవరినీ చర్చలకు పిలువలేదు. మా డిమాండ్లు నెరవేరేవరకు సమ్మె కొనసాగుతుంది. అయితే డాక్టర్ల ఆందోళనను ఇకమీదట జిల్లాస్థాయికి వికేంద్రీకరించాలనే ప్రతిపాదనపై తుది నిర్ణయం తీసుకోవాల్సిఉంది.'
  - డాక్టర్ పూర్ణచంద్రకుమార్, ఏపీ పీహెచ్‌సీల వైద్యాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు.

నేటి నుంచి సులభంగా.. ఇసుక బుకింగ్

- అందుబాటులోకి ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టం పోర్టల్
- రవాణా, నిర్వహణ ఖర్చులు మాత్రమే వసూలు
- సమస్యలను టోల్‌ఫ్రీ నెంబర్లు 1800-425-6025, 08812-234014లకు ఫిర్యాదు చేయవచ్చు
- నూతన ఇసుక విధానాన్ని వివరించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు సిటీ, సెప్టెంబరు 19 : ఉచితంగా ఇసుక పొందడానికి ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వంచే ప్రత్యేకంగా ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టం పోర్టల్ రూపొందించబడిందని కలెక్టర్ వెట్రిసెల్వి చెప్పారు. కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టం పోర్టల్ ద్వారా ఉచిత ఇసుక సరఫరాకు సంబంధించిన అంశాలను జేసీ ధాత్రిరెడ్డితో కలిసి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ' ఇసుకను పూర్తిగా ఉచితంగా ప్రజలకు అందిస్తారు. కేవలం రవాణా, నిర్వహణ , నామమాత్రపు లోడింగ్ చార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఇసుక రవాణాకు సంబంధించి చార్జీలు నిర్ణయించబడ్డాయి. ఇసుక అవసరమైన వారు ముందుగా ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టం పోర్టల్‌లో లాగిన్ అవ్వాలి. అందులో వినియోగదారులకు అందుబాటులో ఉండే ఇసుక రీచ్‌ల వివరాలు , ఎంత ఇసుక కావాలి అనే వివరాలు తెలపగానే ఆటోమేటిక్ గా వినియోగదారులకు వెహికల్ కేటాయించబడుతుది. గతంలో ఇదంతా కుక్కునూరు ఇసుక రీచ్‌ల వద్ద జరిగేది. కానీ శుక్రవారం నుంచి ప్రజలు తమ ఇంటి నుంచి లేదా సమీపంలోని సచివాలయంలో సైతం ఇసుకను బుకింగ్ చేసుకుని పొందవచ్చు. ఇసుక రవాణా చేసే వాహనదారులు ముందుగా తమ వాహనాన్ని ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్టరు చేసుకోవాలి. జిల్లాలో ఇప్పటివరకు 141 మంది ఇసుక రవాణా వాహనదారులు రిజిస్టర్ చేసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో 3 ఇసుక రీచ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికీ 29వేల మెట్రిక్ టన్నుల వరకు ఇసుక నిల్వలు కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట ఇసుక రీచ్‌లో అందుబాటులో ఉన్నాయి. ఇవి 29 రోజుల వరకు సరిపోవచ్చు. ఇసుక సరఫరాలో ఏదైనా సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నెంబరు 1800-425-6025 లేదా 08812-234014 నెంబర్‌కు ఫోన్ ద్వారా తెలపవచ్చు. 24/7 పనిచేసే కంట్రోల్ రూమ్‌ను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశాం. జిల్లాలోని 605 సచివాలయాల సిబ్బందికి ఇసుక కొత్త పాలసీపై శిక్షణ ఇచ్చాం. పనిదినాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మాత్రమే ఇసుక పోర్టల్‌లో ఆర్డరు చేయడానికి అనుమతి ఉంటుంది. గ్రామ, వార్డు సచివాలయాల్లోను ఇసుక ఆర్డరు చేయవచ్చు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇసుక బుక్కింగ్ ఆర్డర్లు తీసుకుంటారు. కేవలం ఆన్‌లైన్ పేమెంట్స్ మాత్రమే అంగీకరించబడతాయి'..అని తెలిపారు.



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి


ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభం..


జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా ఉచిత ఇసుకను పూర్తి పారదర్శకంగా అందించేందుకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సీఎం చంద్రబాబుకు తెలిపారు. ఉచిత ఇసుక విధానంపై ఆన్‌లైన్ పోర్టల్‌ను అమరావతి నుంచి సీఎం గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక కోసం ప్రజలు ఆన్‌లైన్‌లో సులభతరంగా నమోదు చేసుకునే ప్రక్రియను రూపొందించారన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల ద్వారానే కాకుండా వ్యక్తిగతంగాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా పోర్టల్ రూపొందించారన్నారు. ఇసుక సరఫరాలో అక్రమాలు జరగకుండా అవసరమైన ప్రతి వ్యక్తికి ఉచిత ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం కలెక్టర్లను ఆదేశించారు. జేసీ ధాత్రిరెడ్డి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆర్డీవోలు ఎస్ఎస్‌కే ఖాజావలి, కె.అద్దయ్య, రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.శాంతకుమారి, డీపీవో శ్రీనివాస విశ్వనాథ్, గనుల శాఖ డీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర 2047కు జిల్లాస్థాయి ప్రణాళిక

- సీఎస్‌కు వివరించిన కలెక్టర్ వెట్రిసెల్వి

జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌లో జిల్లా స్థాయి ప్రణాళిక ప్రస్ఫుటంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. అమరావతి నుంచి గురువారం సీఎస్ జిల్లా కలెక్టర్లతో స్వర్ణాంధ్ర 2047 మండల , జిల్లా స్థాయి ప్రణాళిక రూపకల్పనపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరం నుంచి కలెక్టర్ వెట్రిసెల్వి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ నేపథ్యంలో రాష్ట్రంలో స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధన కోసం మండల, జిల్లా స్థాయి ప్రణాళికలు రూపొందించి ఆ ప్రణాళికలను క్రోడీకరించి జిల్లా స్థాయి ప్రణాళికను అక్టోబరు 15వ తేదీలోగా ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. రానున్న ఐదేళ్లలో 2024 నుంచి 2029 వరకు ఒక విజన్‌తో కూడిన నివేదిక రూపొందిస్తామన్నారు. స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంటేషన్ రూపకల్పనలో భాగంగా సెప్టెంబరు 21 నుంచి అక్టోబరు 5 వరకు జిల్లాలో నిర్వర్తించాల్సిన కార్యాచరణను వివరించారు.






ముంపులో ఉన్న కైకలూరు జగనన్న కాలనీ

ముంచేశారు!

- జలమయంగా జగనన్న కాలనీలు
- మౌలిక వసతులు లేక ముంపు బారిన..
- గతంలో ఇళ్ల నిర్మాణాలకు ముందే మునిగిన కాలనీలు
- పట్టించుకోని వైసీపీ పాలకులు.. అధికారులు
- లబ్ధిదారులకు స్థలాల అందజేత.. నేడు అవస్థలు
- కూటమి ప్రభుత్వమైనా ముంపు సమస్య తొలగించాలంటూ విజ్ఞప్తి

కైకలూరు, సెప్టెంబరు 19 : వైసీపీ ప్రభుత్వం ఎంతో ఆట్టహాసంగా నిర్మాణం చేసిన జగనన్న కాలనీలు కొల్లేరు వరద ముంపునకు నీట మునిగి అధ్వానంగా మారాయి. పేదలకు నివాస గృహాలను కట్టించి ఇస్తామని రూ.కోట్లు వెచ్చించి భూములు కొనుగోలు చేసి వాటిని పూర్తిస్థాయిలో మెరక చేయకుండానే లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను అందించి వారిని నట్టేట ముంచారు. ఎగువ నుంచి వచ్చిన వరదతో కొల్లేరు ముంపునకు గురి కావడంతో ఆ నీరు ఎగదన్ని గ్రామాల్లోని జగనన్న కాలనీలు నీట మునిగాయి. సరైన రహదారులు, వసతులు కల్పించకుండానే లబ్ధిదారు లను ఒత్తిడి చేసి గృహ ప్రవేశాలు చేసిన గత ప్రభుత్వ పెద్దలు, అధికారులు మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారు. ఆ కాలనీలన్నీ ప్రస్తుతం నీటితో నిండిపోవడంతో ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి.

కైకలూరు నియోజకవర్గంలో పెద్దఎత్తున జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. కైకలూరు పట్టణంలో 94 ఎకరాల భూములను కొనుగోలు జగనన్న కాలనీ పేరిట లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు అందించారు. ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇంటి చుట్టూ నీరు చేరడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటే రహదారులు పూర్తిగా నీట మునిగిపోవడంతో పడవ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కైకలూరు-ఏలూరు రోడ్డులోని జగనన్న కాలనీలోకి సమీపాన ఉన్న పోల్‌రాజ్ డ్రెయిన్ పొంగి పొర్లడంతో ముంపు బారిన పడింది. 2020లో వచ్చిన తుఫాన్ ప్రభావంతో కొల్లేరు ఎగదన్ని ఈ కాలనీ స్థలం నీట మునిగింది. అప్పటికి ఒక్క ఇల్లు కూడా నిర్మాణం చేపట్టలేదు. ముంపును దృష్టిలో పెట్టుకొని ఆ సమయంలో పక్కా ప్రణాళిక రూపొందిం చాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడంతో నేడు లబ్ధిదారులకు శాపంగా మారింది. వేల సంఖ్యలో లబ్ధిదారులు లక్షల్లో అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇప్పుడు ఆ ఇళ్లు నీటమునగడంతో వారు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని కాలనీల పరిస్థితి ఇంతే. జగనన్న కాలనీల్లో సరైన రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు లేవు. దీంతో వరద ముంపే కాకుండా భారీ వర్షాలకు సైతం జగనన్న కాలనీ రహదారులన్నీ జలమయంగా మారుతున్నాయి. కైకలూరు మండలంలోని ఆటపాక నుంచి అగ్రహారం వెళ్లే రహదారిలో, జాన్‌పేటలో, భుజబలపట్నం, కొల్లేరు లంక గ్రామాలైన నత్తగుల్లపాడు, చటకాయ, కొల్లేటికోట, కొట్టాడ గ్రామాల్లో జగనన్న కాలనీలన్నీ నీటిలోనే ఉన్నాయి. ఆయా కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న వారంతా ముంపు రావడంతో గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వమైన ఈ ముంపు బారి నుంచి మా కాలనీలు కాపాడాలంటూ ఆయా ప్రాంత ప్రజలు వేడుకుంటున్నారు.



ముంపులో ఉన్న కొల్లేటికోట జగనన్న కాలనీ



ఎంపికైన క్రీడాకారులతో కళాశాల సిబ్బంది

స్కూల్ గేమ్స్‌కు జట్ల ఎంపిక

తణుకు, సెప్టెంబరు 19 : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు అన్నారు. బుధవారం కళాశాలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో బాలబాలికల క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించారు. డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ లక్ష్మీసుందరీబాయ్, ఎస్‌డి కాలేజి ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా సెక్రటరీ కె.జయరాజు, పీడీలు శ్రీనివాసు, రత్నకుమారి పాల్గొన్నారు.

ఖోఖో : కె.పావనీ, ఎస్.విద్యాస్వి, పి.గాయత్రీ నైనిక (భారతీయ విద్యాభవన్స్, భీమవరం), పి.నవ్య, కె.కీర్తన (సెయింట్ థెరిస్సా-ఏలూరు) కె.సుభాసినీ, టి.సుష్మ, శ్రీసుధ (ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల-తణుకు), ఎన్.హేమలక్ష్మి ప్రసన్న, కె.శ్వేతాశ్రీ (ఏపీఆర్ జూనియర్ కాలేజి-నాగిరెడ్డిగూడెం) ఎం.శరణ్య (జూనియర్ కాలేజి-ద్వారకాతిరుమల) ఎస్.స్రవంతి, కె.రోజా దీపిక (జంగారెడ్డిగూడెం) జి.భూమిక (పోలసానిపల్లి) సిహెచ్.శైలజా,ఎస్.భవానీ(గోపాలపురం) ఎ.సువర్ణ

త్రోభాల్ : నిధి, బి.అనూష, ఎస్.హర్షిని, టి.ప్రభుప్రియ (సెయింట్ థెరిస్సా, ఏలూరు)సి.శ్రావణి, కె.వెన్నెల (గురుకులం-గోపాలపురం) కె.లక్ష్మీకుమారి, ఎ.పూజిత, కె.అమృతశ్రీ (గురుకులం-పోలసానిపల్లి), బ్లెస్సీ, కె.మేరిమణి, టి.కవిత (ఎస్‌కెఎస్‌డీ కళాశాల-తణుకు), .లావణ్యమహేశ్వరి, పి.తేజస్వినీ (గురుకులం-జంగారెడ్డిగూడెం)

వాలీబాల్: బి.యేసుమణి (ఆకివీడు) ఎం.శిరీష, పి.కావ్య, టి.హస్వి (సెయింట్ థెరిసా-ఏలూరు) ఎ.శిరీష, జి.విజయ లక్ష్మి (ఎస్‌కెఎస్‌డీ- తణుకు) ఎన్.ప్రవల్లిక (ద్వారకాతిరుమల గురుకులం,) పి.సాహితి, బి.భవాని, బి.లావణ్య (గురుకులం-గోపాలపురం) ఎస్.రోజాప్రవల్లిక (చాగల్లు)

టేబుల్ టెన్నిస్ : ఎ.యేసురాణి, జి.నవ్య, బి.వర్ష, కె.సౌమ్య, కె.ఐశ్వర్య, డి.అపర్ణ (సెయింట్ థెరిస్సా -ఏలూరు) కుష్బూ నిసా (ఎస్‌కెఎస్‌డీ, తణుకు)

బ్యాడ్మింటన్ : ఎం.అమృత వర్షిణి, డి.యశ్వని నవ్య, ఆర్, మేఘన, ఎస్.ఈశ్వరి, పి.రోషితశ్రీ (ఎస్‌కెఎస్‌డి, తణుకు)

చదరంగం : ఎస్.అర్షు , పి.సత్యనారాయణ,(చాంబర్స్ -పాలకొల్లు) వై.జోషి (ఏపీఎస్‌డబ్ల్యుఆర్ -పెదవేగి) ఎస్. యోగేంద్ర (ఏపీఎస్‌డబ్ల్యుఆర్‌ఎస్ ఎల్‌బీచర్ల) కె.సుభాషిణి, (ఏపీఎస్‌డబ్ల్యుఆర్‌ఎస్- ఆరుగొలును)

టెన్నికాయిట్ :బి.మానస, కె.సుజిని (నల్లజర్ల), డి.దేవిశ్రీ (థెరిస్సాఏలూరు) కె.భవాని, కె.గౌరీ పూజశ్రీ (ఏపీఆర్‌ఎస్ -నాగిరెడ్డిగూడెం) జి.రక్షిత, ఎన్.నవ్య (పోలసానిపల్లి) మనీషా (గురుకులం జంగారెడ్డిగూడెం)

యోగా : వై.కుసుమ కావ్య, దేవమాధురి, కీర్తి సువర్ణిక, శశి వెన్నెల, సంధ్యారాణి (ఎస్‌కెఎస్‌డీ- తణుకు) రాధ (ఎస్‌ఎన్‌వీటీ-తణుకు), జి.సుస్మారాణి, ఎస్.శ్రావణి (నాగిరెడ్డిగూడెం) ఎంపికయ్యారు.

5 నుంచి భీమవరంలో ఇస్రో ఆధ్వర్యంలో అంతరిక్ష వారోత్సవాలు

భీమవరంటౌన్, సెప్టెంబరు 19 : విద్యార్థి దశ నుంచే వైజ్ఞానిక విషయాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో శ్రీహరికోట ఇస్రో కార్యాలయ ఉద్యోగులు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిశారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా వచ్చేనెల 5 నుంచి ఏడో తేదీ వరకు భీమవరంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలుపుతూ కరపత్రాన్ని అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వచ్చేనెల 4 నుంచి 10వ తేదీవరకు వారం రోజులపాటు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. శ్రీహరికోట స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లోని పది ప్రాంతాలను ఎంపికచేసి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిం చనున్నట్లు తెలిపారు.మన రాష్ట్రంలోని ఈ జిల్లాలో భీమవరం పట్టణాన్ని ఎంపిక చేశారని, విష్ణు స్కూల్‌లో కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 5వ తేదీన స్పేస్ వాక్ కార్యక్రమంతో ప్రారంభించి,ఆరో తేదీన స్పేస్ క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలు నిర్వహిస్తారన్నారు. ఇస్రో ఎగ్జిబిషన్ ఉంటుందని జిల్లాలోని అన్ని కళాశాలల, పాఠశాలల విద్యార్థులు సందర్శించి వైజ్ఞానిక విషయాలను తెలుసుకోవచ్చన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో కూడా పోటీలు నిర్వహిస్తారని ఆ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. శ్రీహరికోట నుంచి క్వాలిటీ కంట్రోల్ జనరల్ మేనేజర్ పి.ఏడు కొండలు, హెడ్ ఆఫ్ సివిల్ డిపార్ట్మెంట్ డాక్టర్ సతీష్, సైంటిస్ట్ ఆకెళ్ళ శేష సాయి ఉన్నారు.

23, 24న విర్డ్ ఆసుపత్రిలో హ్యాండ్‌సర్జన్ సేవలు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 19: ద్వారకాతిరుమల విర్డ్ ట్రస్ట్ ఆసుపత్రిలో ఈనెల 23, 24 తేదీల్లో ప్రముఖ హ్యాండ్ సర్జన్ డాక్టర్ భాస్కర్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించనున్నట్లు ఆసుపత్రి ట్రస్ట్ ఛైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు తెలిపారు. పుట్టుకతో వచ్చిన చేతి సమస్యలు, పోలియో, ఇతర చేతి సమస్యలు ఉన్నవారు ఆసుపత్రిలో సంప్రదించాలని కోరారు. ఎన్టీఆర్ వైద్య సేవా పథకంలో నిర్దేశించిన వైద్యసేవలను ఉచితంగా అందిస్తామన్నారు. ముందుగా 83744 45108,79016 95176 నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

27న ద్వారకాతిరుమలలో రాష్ట్ర రైతు సదస్సు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 19: ద్వారకాతిరుమలలో ఈనెల 27న రాష్ట్ర రైతు సదస్సు నిర్వహిస్తున్నామని, 27 నుంచి 29 వరకూ రైతు శిక్షణా తరగతులను జరుపుతామని ఏపీ రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ తెలిపారు. ద్వారకాతిరుమల యూటీఎఫ్ భవనంలో రైతుసంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సంక్షోభం- మద్దతు ధరలు అనే అంశంపై సదస్సు జరుగుతుందని ముఖ్య అతిథిగా వ్యవసాయ శాఖ మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు విచ్చేస్తారన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 200 మంది రైతు ప్రతినిధులు, రైతుసంఘ రాష్ట్ర నేతలు హాజరవుతారని వివరించారు. కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్, జివి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుపుతున్న డీఎస్పీ రవిచంద్ర..నకిలీ కరెన్సీ నోట్లు

దొంగ నోట్ల ముఠా అరెస్ట్

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 19 : అసలు కరెన్సీకి మూడు రెట్లు నకిలీ కరెన్సీ ఇస్తామని మోసం చేసే ఐదుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవిచంద్ర తెలిపారు. గురువారం జంగారెడ్డిగూడెం స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. గతంలోనే వీరిపై దొంగనోట్ల కేసు నమోదైందని వీరంగా తప్పించుకు తిరుగుతున్నారన్నారు. వీరి నుంచి రూ.2.50 లక్షల నకిలీ ఐదు వందల నోట్లు, రూ.నలభైవేల ఒరిజినల్ ఐదు వందల నోట్లు, ఒక కారు, ద్విచక్ర వాహనం స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. నకిలీ నోట్లన్నీ చిన్న పిల్లలు ఆడుకునే టాయ్ కరెన్సీ అని వాటిని ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసి తెప్పించినట్లు తెలిపారు. పట్టణానికి చెందిన బర్రె సుధీర్, టి.నరసాపురం మండలం అప్పలరాజుగూడేకి చెందిన చిట్ల నాగరాజు, నెర్సు గంగాధర్, జంగారెడ్డిగూడెం మండలం పేరంపేటకు చెందిన ఏలేటి చంద్రశేఖర్, జంగారెడ్డిగూడెం మండలం వేగవరానికి చెందిన ఓగిరాల బాబులను అరెస్టు చేశామని వీరిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని తెలిపారు.



అధ్వానంగా కే.పెంటపాడు-పడమరవిప్పర్రు రహదారి



గోతులు పడిన కొమ్మర-పాలూరు రహదారి

ప్రయాణం..నరకప్రాయం

కే.పెంటపాడు-పడమర విప్పర్రు రోడ్డుకు మోక్షమెప్పుడో

పెంటపాడు, సెప్టెంబరు 19 : కే.పెంటపాడు నుంచి పడమర విప్పర్రు వెళ్ళే రహదారి సమస్య ఇప్పటిది కాదు. సంవత్సరాల కాలంగా అలాగే ఉంది. ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే సాహసం చేసినట్లే. ఒళ్ళు మొత్తం హూనమైపోతుంది. రహదారి మొత్తం గతుకులతో అధ్వానంగా ఉంటుంది. అత్యవసరంగా ప్రయాణం చేద్దామంటే ఇబ్బందులు పడాల్సిందే. ఎవరికి ఏమి జరిగినా తాడేపల్లిగూడెం వెళ్లాల్సిందే. ఇటీవల గ్రామంలో ఒక వ్యక్తి ని పాము కరిచింది. పొలం నుంచిఅతను ఇంటికి వచ్చి సమాచారం చేప్పేసరికే అరగంట దాటిపోయింది. దీంతో ఆ వ్యక్తికి అత్యవసరంగా చికిత్స అందించాల్సి వచ్చింది. వేగంగా కారు నడిపే ఒక వ్యక్తి అతన్ని రహదారిపై గతుకులను కూడా లెక్క చేయకుండా సకాలంలో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలిచండంతో గండం నుంచి బయట పడ్డాడు. ముఖ్యంగా గర్భిణులు ఈ రహదారిపై ప్రయాణం చేయడానికి నరకం చూస్తున్నారు. గ్రామంలో స్వయంభూగా వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ఈ రహదారి పడమరవిప్పర్రు మీదుగా గణపవరం వెళ్తుంది. దీంతో ఈ రహదారిపై ప్రయాణాలు చేసేవారి సంఖ్య కూడా ఎక్కువే. వాస్తవానికి కే.పెంటపాడు నుంచి పడమరవిప్పర్రు రహదారికి గత ప్రభుత్వ హయాంలో రూ.7 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పడమరవిప్పర్రు గ్రామం మొదటి నుంచి శివారు కాలువ వంతెన వరకూ ఆర్అండ్‌బీ నిధులు రూ 3 కోట్లతో సీసీ రహదారి నిర్మాణం జరుగుతోంది.

అత్తిలి-తణుకు రోడ్డులో అడుగడుగునా గోతులే

అత్తిలి, సెప్టెంబరు 19 : మండలంలోని రహదారులు అధ్వాన స్థితికి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారుల మీద ప్రయాణం చేయాలంటే వల్లు హూనం అవ్వాల్సిందే. ప్రధానంగా అత్తిలి నుంచి తణుకు వెళ్ళే రహదారిలో కెఎస్ గట్టు గ్రామంలో రహదారి కోతకు గురి కావడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొసారి అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం ఈ రహదారి గుండా అనేక మంది వెళ్తూ ఉంటారు. మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలూరు నుంచి కొమ్మర వెళ్ళే రహదారిలో అడుగుకో గొయ్యి ఉంది. వర్షం వస్తే గోతుల్లో నీరు నిలిచి పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు గోతులో పడడంతో గాయాల పాలవుతున్నారు



అత్తిలి రేలంగి మధ్యలో కోతకు గురైన రహదారి



కూలిన బైనేరు బ్రిడ్జి(ఫైల్)

ఏడేళ్లుగా అవస్థలు..

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 11: జంగారెడ్డిగూడెం నుంచి రాజ మహేంద్రవరం వైపు వెళ్లే రహదారిలో ఉన్న బైనేరు కాలువపై బ్రిడ్జి కూలిపోయి ఏడు సంవత్సరాలవుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2018 ఆగస్టులో వచ్చిన భారీ వరదలకు బైనేరు బ్రిడ్జి కూలిపోయింది. తర్వాత 2019లో ఎన్నికలొచ్చాయి. వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ఈ బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి సారించలేదు. ప్రభుత్వం రూ.3.6 కోట్ల నిధులు మంజూరు చేసి మూడు సార్లు టెండర్లు పిలిచినా బిల్లులు రావని భయపడి పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. బ్రిడ్జి లేకపోవడంతో జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల ప్రజలు బైనేరు బ్రిడ్జి దగ్గరలో ఉన్న ఫైర్ స్టేషన్ పక్కనే ఉన్న లింకు రోడ్డు నుంచి బైపాస్ రోడ్డుకు వెళుతున్నారు. నిత్యం వందల కొద్దీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు ఈ లింకు రోడ్డుపై నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్తుండడంతో రోడ్డంతా గోతులుగా మారింది.

ఎమ్మెల్యే పట్టించుకోవాలి



ఏడేళ్ళుగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టక పోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వంతెనకు అవతలి వైపున ఉన్న కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాలకు చెందిన ప్రజలు పాత బస్టాండు వైపుగా పట్టణంలోకి రాకుండా బైపాస్ రోడ్డు నుంచి బుట్టాయిగూడెం రోడ్డులో నుంచి పట్టణంలోకి వస్తుండ డంతో పాత బస్టాండులో ఉన్న చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతు న్నారు. చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ దృష్టి సారించి బైనేరు బ్రిడ్జి నిర్మించేందుకు కృషి చేయాలి.

-వలవల తాతాజీ, నాల్గవ వార్డు కౌన్సిలర్, జంగారెడ్డిగూడెం



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న డీఆర్ఎం నరేంద్ర

కోటిపల్లి రైల్వే లైన్ పనులు వేగవంతం చేయండి

కొత్త రైళ్లపై కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ సమీక్ష

నరసాపురం, సెప్టెంబరు 19: నరసాపురం- కోటిపల్లి రైల్వే లైన్ పనుల్ని వేగవంతం చేయాలని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ ఆదేశించారు. గురువారం విజయవాడలో రైల్వే డివిజన్ అధికారులతో జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు, కొత్తరైళ్లు, వందేభారత్ రైళ్ల జిల్లాలో ప్రవేశం, తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర పాటిల్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కోటిపల్లి ప్రాజెక్టు పనుల్ని మంత్రికి వివరించారు. వంతెనల నిర్మాణాలు, పురోగతి, భూ సేకరణ, ఇంకా ఎక్కడెక్కడ పెండింగ్ అన్న విషయాలను మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి అధికారులతో మాట్లాడుతూ ఈ కొత్త రైల్వేలైన్ రెండు జిల్లాల వాసుల చిరకాల కోరిక అని దీనికి అవసరమైన నిధులు కేంద్రం నుంచి విడుదల చేయిస్తానని, భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. 2025 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు. అలాగే పెండింగ్, ప్రతిపాదనలో ఉన్న రైళ్లను పట్టాలెక్కించాలన్నారు. వందేభారత్ రైలుతో పాటు జిల్లాలోని నరసాపురం, భీమవరం, టీపీ గూడెంలో కడుతున్న అమృత్ భారత్ పనుల్ని కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. రైల్వే అధికారులు శ్రీనివాసరావు, రాంబాబు, వరుణ్‌బాబు, సురేష్, శ్రీసత్య స్వరూప్‌లు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల ఈవోగా ఎన్వీఎస్ఎన్ మూర్తి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 19: రాష్ట్రంలో ప్రధాన దేవాలయాల్లో ఒకటైన ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా ఎన్వీ ఎస్ఎన్ మూర్తిని నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవదాయశాఖలో ముగ్గురు జాయింట్ కమిషనర్‌లను బదిలీ చేశారు. తిరుమల తిరుపతి ఆర్జేసీగా పని చేస్తున్న మూర్తిని ద్వారకాతిరుమలకు బదిలీ చేశారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన వేంద్ర త్రినాథరావును సింహాచలం వరాహలక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానానికి బదిలీ చేశారు.

ఆ..విద్యార్థినుల భవిష్యత్తు ఏమిటి ?

చదువు మానేసి ఆశ్రమం నుంచి ఇళ్లకు వెళ్లిపోయిన 45 మంది

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 19 : బంగారు భవిష్యత్తు కలిగిన 45 మంది విద్యార్థుల భవితవ్యం అధికారుల నిర్లక్ష్యంతో చీకటిమయం అవుతోంది. ఏలూరు నగరంలో ఒక సేవా సంస్థ పేరుతో ఆశ్రమం ముసుగులో బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. దానికి అనుమతులు ఉన్నాయో లేదో తనిఖీలు చేయాల్సిన బాలికల సంరక్షణ అధికారులు నిర్లక్ష్యం చేశారే విమర్శలు వస్తున్నాయి. వసతి గృహాలకు సరైన రక్షణ ఉందో లేదో పరిశీలించాల్సిన పోలీసు శాఖ కూడా వైఫల్యం చెందిందని విమర్శలు వస్తున్నాయి. విద్యాశాఖ కూడా ఆ విద్యార్థులు డేస్కాలర్సా, హస్టలర్సా అనే విషయాలను గుర్తించాల్సి ఉంది. విద్యాశాఖాధికారులు కూడా తమకు ఏమి పట్టనట్లు వ్యవహరించడంతో ఇలాంటి పరిస్థితి వచ్చిందని అంటున్నారు. వీరికి స్థానికంగా ఉన్న ఎస్సీ బీసీ హాస్టల్స్‌కు సంబంధించిన కొంతమంది ఉద్యోగులు కూడా సహకరించారని ఆరోపణలు వస్తున్నాయి. అక్కడ హాస్టల్స్‌లో సీటు కోసం వెళ్ళిన విద్యార్థినులకు తమ వద్ద ఖాళీలు లేవని ఉచితంగానే వసతి గృహం సేవాశ్రమం వారు నిర్వహిస్తున్నారంటూ ఉచిత సలహా ఇచ్చేవారని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో అమీనాపేటలో ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లో చదివిన విద్యార్థులు, అక్కడ వసతులు, ఆహారం సరిగా లేకపోవడంతోనే కొంతమంది వెళ్ళారని చెప్తున్నారు. అమీనాపేటలో ఉన్న హాస్టల్ నుంచి 11 మంది విద్యార్థినులు బయటకు వెళ్ళి ఆ ఆశ్రమం వసతి గృహంలో చేరారు. మరో వసతి గృహం నుంచి ముగ్గురు విద్యార్థినులు ఈ ఏడాది చేరారని తెలుస్తోంది. ప్రస్తుతం ఆశ్రమం వసతి గృహంలో 45 మంది విద్యార్థినులు ఉండగా లైంగిక దాడుల సంఘటనలతో తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలను ఇళ్ళకు తీసుకువెళ్ళిపోయారు. కనీసం ఆ పిల్లలకు మరోచోట వసతి గృహం ఏర్పాటు చేయడం, వేరే వసతి గృహాలకు చేర్పించడం కాని అధికారులు చేయలేదు. ప్రకాశం జిల్లా నుంచి కూడా ఇంటర్మీడియట్ చదివే ఒక విద్యార్థిని ఈ వసతి గృహంలో ఉండి చదువుతోంది. ఈనెల 18వ తేదీ సాయంత్రం వరకూ అధికారులు వచ్చి ఏమైనా సాయం చేస్తారని ఎదురు చూసి ఎవరూ రాకపోవడంతో చివరకు సాయంత్రం వరకూ పస్తులు ఉండి తమ తల్లితోపాటు వెళ్ళిపోయింది. ఉన్నతాధికారులు తక్షణం స్పందించి 45 మంది విద్యార్థినుల భవిష్యత్తును కాపాడాలని పలువురు కోరుతున్నారు. వసతి గృహాలు ఎక్కడెక్కడ ఉన్నాయో వాటికి అనుమతులు, సౌకర్యాలు పరిశీలించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.



ప్రతిజ్ఞ చేస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, సీఈవో, సభ్యులు

జిల్లా పరిషత్‌లో స్వచ్ఛతా హీ సేవ

ఏలూరుసిటీ, సెప్టెంబరు 19:జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం స్వచ్చతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొని జిల్లా పరిషత్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాలలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రోజువారీ నిర్దేశించుకున్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. మన ఇంటిని, మన గ్రామాల్లో పరిశుభ్రత కోసం కొంత సమయం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. జడ్పీ సీఈవో సుబ్బారావు ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. జడ్పీ డిప్యూటీ సీఈవో నిర్మలాజ్యోతి, జిల్లా పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నా పోలికలతో కొడుకు కావాలి..!

కోడలిని వేధించిన భద్రాద్రి రామాలయ ప్రధాన అర్చకుడు

తాడేపల్లిగూడెం పోలీసు స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు

తండ్రీ కొడుకులపై లైంగిక వేధింపుల కేసు

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 19 : తన మామ తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ.. భద్రాద్రి రామాలయ ప్రధాన అర్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులుపై ఆయన కోడలు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఆయనపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఆగస్టు 14న నమోదైన ఈ కేసు విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. 2019లో ఆమెకు సీతారామానుజాచార్యులు కుమారుడు వెంకట సీతారామ్‌తో వివాహం జరిగింది. అనంతరం పలు సందర్భాల్లో మామ తనను లైంగికంగా వేధించారని.. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన కోడలు ఆరోపించారు. మామగారిని నిలదీస్తే.. "నా కుమారుడు దత్తపుత్రుడు. నాకు నా పోలికలతో ఒక బాబు కావాలి" అని చెప్పారని.. ఆయన గురించి పలుమార్లు అత్తకు, భర్తకు చెప్పినా పట్టించుకోకపోగా తననే తిట్టి, గదిలో బంధించి చిత్రహింసలు పెట్టారని పేర్కొన్నారు. పెళ్లయిన ఆర్నెళ్ల తర్వాత నుంచి.. రూ.10 లక్షల కట్నం తేవాలంటూ అత్త, ముగ్గురు ఆడపడుచులు, రెండో ఆడపడుచు భర్త, మూడో ఆడపడుచు భర్త తనను వేధిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు వీరందరిపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం దేవస్థానం అధికారులకు తెలియకుండా గోప్యంగా ఉంచారనే ఆరోపణలతో దేవస్థానం ప్రధాన అర్చకుడు సీతారామానుజాచార్యులుపై సస్పెన్షన్ వేటు పడింది. ఇదే ఘటనలో దేవస్థానంలో అర్చకుడిగా పని చేస్తున్న ఆయన కుమారుడు సీతారామంపై సైతం కేసు నమోదు కావటంతో అతడిని కూడా సస్పెండ్ చేస్తూ భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తమ్ముడి భార్యపై కన్నేసిన అన్న

ద్రౌపదికి ఐదుగురు లేరా..? సర్దుకుపోవాలంటూ

చిన్న కోడలికి అత్త హితవు

లొంగకపోయే సరికి తమ్ముడు, మరదలిపై దాడి

నూజివీడు/నూజివీడు టౌన్, సెప్టెంబరు 19 : తను ఏం చేసినా వెనకేసుకుని వచ్చే తల్లి.. తమ్ముడి నిస్సహాయత, మరదలి అమాయకత్వం.. వెరసి అతనిలో కీచకుడు వెలుగు చూశాడు. ఏదో రకంగా తన మరదలిని లొంగదీసుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేశాడు. లొంగకపోయే సరికి వారిద్దరిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గాయపడిన వారిద్దరిని చికిత్స నిమిత్తం నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలివి.. ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన కలిదిండి సత్యనారాయణ ప్రసాద్ కుమార్తె దివ్యకు ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం పెదవెలమిల్లికి చెందిన దేవిన వెంకటేష్‌కు తొమ్మిది నెలల క్రితం వివాహమైంది. వెంకటేష్ అన్న వీరభద్రం దివ్యపై కన్నేసి లైంగిక వేధింపులకు దిగుతున్నాడు. దీనిని గుర్తించిన వెంకటేష్ తన సోదరుడి వ్యవహార శైలిపై అభ్యంతరం చెబుతూ తల్లి దేవిన మణికుమారికి విషయం వివరించాడు. దీనికి ఆమె 'భార్య లేని వాడు కదా.. ఏం చేస్తాడు. పాండవులు ద్రౌపదిని చేసుకోలేదా ? మీరిద్దరే కదా ఇంటి విషయాల్లో సర్దుకుపోవాలి' అంటూ పెద్ద కుమారుడు వీరభద్రాన్ని వెనకేసుకుని రావడంతో అతను నిర్ఘాంతపోయాడు. వెంకటేష్ తమ పరిస్థితిని అత్త మామలైన కలిదిండి సత్యనారాయణ, జ్యోతిలకు వివరించారు. అయినప్పటికీ పరిస్థితులు చక్కబడకపోగా వేధింపులు మరింత పెరిగాయి. వీరభద్రం పలుమార్లు దివ్యపై విచక్షణా రహిత దాడికి దిగేవాడు. ఈ క్రమంలో శుక్రవారం తమ్ముడు, మరదలిపై అతను మరోసారి దాడి చేయడంతో వారు ఇంటి నుంచి బయటపడి నిడదవోలు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. విషయం తెలిసిన మామ సత్యనారాయణ కూతురు, అల్లుడిని నూజివీడు తీసుకువచ్చి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరి ఒంటిపై పలుచోట్ల తీవ్రగాయాలు ఉండటంతో చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి, జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దాడికి దిగి రోజులు గడుస్తున్నా నిందితులపై చర్యలు మాత్రం కానరాకపోవడంతో తమ కూతురు, అల్లుడికి న్యాయం చేయాల్సిందిగా సత్యనారాయణ కోరుతున్నాడు.

క్రైమ్ కార్నర్

బీచ్‌లో గల్లంతైన యువకుని మృతి

మొగల్తూరు,సెప్టెంబరు 19: పేరుపాలెం బీచ్‌లో గల్లంతైన యువకుని మృతదేహం లభ్యమైందని ఎస్ఐ జి.వాసు తెలిపారు. భీమవరం పట్టణం మెంటేవారితోటకు చెందిన గంధం ప్రవీణ్ కుమార్ తన స్నేహితులతో కలిసి బుధవారం మధ్యాహ్నం బీచ్‌కు వెళ్లారు. తీరంలో సరదాగా గడిపిన అనంతరం స్నానానికి దిగారు. అలలు ఉధృతంగా రావడంతో ప్రవీణ్ కుమార్ (17) గల్లంతయ్యాడు. గల్లంతైన యువకుని మృతదేహం గురువారం ఉదయం మోళ్ళపర్రు బీచ్ ప్రాంతంలో తీరానికి కొట్టుకువచ్చింది. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 19 : కడుపునొప్పి భరించలేక ఒక యువకుడు తీవ్ర అస్వస్థతకు గురై విజయవాడలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు శనివారపుపేటలోని రామాలయం వీధినకు చెందిన సుంకర మణికంఠ (30) కొంతకాలం నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బాధను భరించలేక ఈనెల 15వ తేదీన పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు త్రిటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి గురువారం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపించి మృత దేహాన్ని బంధువులకు అప్పగించారు.

షెడ్డు పైనుంచి పడి చికిత్స పొందుతూ మృతి

లింగపాలెం, సెప్టెంబరు 19: ఇంటిపై రేకులు వేస్తూ జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ధర్మాజీగూడెంలో చోటుచేసుకుంది. ముసునూరు మండలం లోపూడి గ్రామానికి చెందిన సత్తిబాబు (44) ఈనెల 13న ధర్మాజీగూడెంలోని ఓ ఇంటిపై రేకులు వేస్తుండగా రేకులు పగిలి కిందపడిపోయాడు. ధర్మాజిగూడెం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళి ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు ఆసుపత్రికి తీసుకువెళ్ళగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 19 పట్టాలు దాటుతున్న ఒక వృద్ధురాలిని వేగంగా వెళ్తున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని నూజివీడు రైల్వే స్టేషన్ ఫైఓవర్ బ్రిడ్జి కింద పట్టాలు దాటుతున్న వృద్ధురాలిని రైలు ఢీకొంది. ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్‌కు సమాచారం అందడంతో వెళ్లి పరిశీలించారు. మృతురాలు పెదపాడు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన పసుపురెడ్డి సుజాత (75)గా గుర్తించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి గురువారం తరలించారు.

అప్పుల బాధతో ఉల్లిపాయల వ్యాపారి ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 19: అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడేపల్లిగూడెంలో చోటు చేసుకుంది. అత్తిలికి చెందిన తమ్మాబత్తుల రాము (52) ఉల్లిపాయల వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో నష్టం రావడం, అప్పుల వాళ్ల ఒత్తిడి చేస్తుండటంతో గురువారం ఉదయం పట్టణంలోని ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకుని తలుపులు వేసుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గది నుంచి రాము బయటకు రాకపోవడంతో సిబ్బంది గది తలుపులు తెరిచి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతున్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.



బోల్తాపడిన లారీ.. మృతి చెందిన డ్రైవర్.. గాయాలపాలైన క్లీనర్

అల్లం లోడు లారీ బోల్తా..డ్రైవర్ మృతి

దెందులూరు, సెప్టెంబరు 19 : రోడ్డు డివైడర్‌ను ఢీకొని అల్లం లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడటంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్‌కు గాయాలయ్యాయి. అల్లం లోడు వేసుకుని వెస్ట్ బెంగాల్ వెళుతుండగా జంగారెడ్డిగూడెం- తంగెళ్లమూడి ప్రధాన రహదారిలోని సోమవరప్పాడు పెట్రోలు బంకు దాటిన తరువాత వేగవరం సమీపంలో అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీ కొట్టింది. లారీ నడుపుతున్న కోలకతాకు చెందిన లారీ డ్రైవర్ షేక్ నవబ్ బాషా (43) మృతి చెందాడు. క్లీనర్‌కు గాయాలవడంతో జాతీయ రహదారి పోలీసులు అంబులెన్స్ (108)లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు లారీని పక్కకు తీయించారు. దొరికిందే సందుగా తిరగపడిన లారీ నుంచి చాలామంది అల్లం పట్టుకుపోయారు..

భీమవరం రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ దాడులు



భీమవరం క్రైం, సెప్టెంబరు 19: ఏలూరు రీజనల్ విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీరాంబాబు ఆదేశాలతో భీమవరం పట్టణంలో విజిలెన్స్ రెవెన్యూ పౌర సరఫరా అధికారులు రేషన్ దుకాణాలపై దాడులు చేశారు. దాడుల్లో పీడీఎస్ బియ్యం, పంచదార, సరుకుల్లో వ్యత్యాసాలను గుర్తించినట్లు తెలిపారు. ఎం.వి. సుబ్బయ్య షాప్ నెం.0584031, పీడీఎస్ బియ్యం 600 కేజీలు, 23 కేజీలు పంచదార, 70 కేజీల పిండి ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. షాప్ నంబర్ 0584022లో బియ్యం 559 కేజీలు, పంచదార 5 ప్యాకెట్లు తక్కువ, షాప్ నంబర్ 05804002లో పంచదార 400 ప్యాకెట్లు ఎక్కువ ఉన్నట్లుగా నిర్ధారించారు. ఈ మూడు రేషన్ దుకాణాలపై 6 (ఏ) కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ శివరామకృష్ణ, విజిలెన్స్ తహసీల్దార్ కన్యాకుమారి, విజిలెన్స్ ఏవో సురేష్, విజిలెన్స్ ఎస్ఐ రంజిత్‌కుమార్, సీఎస్ ఆర్ఐ సురేష్, రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు.



ఎస్పీకి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన వైసీపీ నాయకులు

శశికుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 19: బాలికలపై లైంగిక దాడికి పాల్పడిన శశికుమార్‌పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అమీనాపేటలోని సేవా ఆశ్రమంలో బాలికలపై జరిగిన అకృత్యాలకు సంబంధించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసీపీ నాయకులు గురువారం ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ అనుమతి లేకుండా వసతిగృహం నిర్వహించడంపై చర్యలు తీసుకోవాలన్నారు. శశికుమార్‌తో పాటు అతని భార్య, సహకరించిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు మా ప్రతినిధి బృందం బాలికల తల్లి దండ్రులతో మాట్లాడతారన్నారు. జయప్రకాష్, విజయ్‌రాజు, డిప్యూటీ మేయరు నూకపెయ్యి సుధీరుబాబు, మున్నుల జాన్‌గురునాథ్, కిలాడి దుర్గారావు, నెర్సు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి : మహిళా సమాఖ్య



మాట్లాడుతున్న మహిళా సమాఖ్య నేతలు

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 19: మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య నాయకురాలు మన్నవ యామిని, శ్యామల, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం.సాదిక్ అన్నారు. సీపీఐ కార్యాలయం వద్ద గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అమీనాపేట స్వామిదయానంద సరస్వతి వసతిగృహంలో బాలికలపై లైంగిక దాడికి పాల్పడిన శశికుమార్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మద్యం, డ్రగ్స్ అక్రమ అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. ఆడ పిల్లలకు రక్షణ కరువైందని, కామాంధులు పెరిగారని చెప్పారు. వసతి గృహానికి విద్యాశాఖ, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేవని తెలిసిందన్నారు. వసతి గృహంలో ఆశ్రయం పొందిన బాలికలకు చదువు ఆటంకం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్పీకి వినతిపత్రం ఇచ్చారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయిబాబా, శ్యామల, చిన్ని, మోహన్ పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా జట్ల ఎంపిక



వాలీబాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

పెదవేగి, సెప్టెంబరు 19: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో భాగంగా మండలస్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీలు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో గురువారం జరిగాయి. మండలంలోని పాఠశాలల నుంచి 450మంది విద్యార్థులు హాజరయ్యారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, షటిల్‌తోపాటు అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఎంఈవోలు సీహెచ్. బుధవాస్, వి.అరుణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు క్రీడా పోటీలను ప్రారంభించారు. నియోజకవర్గ క్రీడాజట్లను ఎంపిక చేశామని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. పీడీలు, పీఈటీలు బి.విజయలక్ష్మి, జె.రామకృష్ణ, కె.రాజగోపాల్, ఎ.సన్యాసిరావు, జాన్, రఫీ, ధనలక్ష్మి, పి.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: క్రీడా పోటీలతో ఆరోగ్యంతో పాటు చురుకుదనం, ఉల్లాసంగా ఉంటారని ఎంఈవో కిరణ్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో మండల స్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. మూడురోజుల పాటు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ జరుగుతాయని, ఎంపికైన వారు నియోజకవర్గస్థాయి పోటీలకు అర్హులవుతారు. 12 పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని మొత్తం 21రకాల పోటీలు జరుగుతాయని, తొలిరోజు 150మంది పాల్గొనడం విశేషమన్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ మండల కార్యదర్శి పి.వేణు, హైస్కూల్ హెచ్ఎం సుధాకర్, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలో సత్రంపాడు విద్యార్థులకు ప్రథమస్థానం



విజేతలకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఈవో

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 19: ఏపీ యూత్ ఫెస్ట్-2024లోభాగంగా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి (నాకో) పాఠశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించింది. సత్రంపాడు జడ్పీ హైస్కూలు విద్యార్థినులు పి.శ్రగ్విత, ఇ.కీర్తన బృందం విజేతగా నిలిచింది. ఈ బృందానికి రూ. 10వేలు నగదు బహుమతి 'నాకో' అందజేసింది. డీఈవో కార్యాలయంలో విద్యార్థినులకు డీఈవో అబ్రహం ప్రశంసాపత్రాలను గురువారం అందజేశారు. హెచ్ఎం ఎన్.శ్రీనివాసరావు, బీఏ.సాల్మన్ రాజు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పరిశీలించిన మెక్సికో బృందం



జీవామృతం తయారీ వివరిస్తున్న ట్రైనర్

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 19: ప్రకృతి వ్యవసాయ విధానాలు అబ్బుర పరుస్తున్నాయని మెక్సికో ప్రభుత్వ ఏరియా డైరెక్టర్ డియాజ్ మరియా అన్నారు. జిల్లాలో 3 రోజుల పర్యటనలో భాగంగా గురువారం గుండుగొలను కుంటలో పర్యటించారు. స్థానిక ప్రకృతి వ్యవసాయ వనరుల శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు. జీవామృతం, మరి కొన్ని ప్రకృతి రసాయనాల తయారీ విధానాన్ని, ఉపయోగాలను మెక్సికో బృందానికి ట్రైనర్ కృష్ణమూర్తి వివరించారు. స్మిత జాకోబ్, రైతు సాధికార సంస్థ అధికారులు అరుణ, సురేష్, మధుప్రీతి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు పాల్గొన్నారు.

● పెదవేగి: లక్ష్మీపురంలో ప్రకృతి విధానంలో సాగవుతున్న వక్క, మిరియాలు, ఆయిల్‌పామ్, బిర్యానీ ఆకులు, అల్లం, గిరిజన రకపు పసుపు, నల్ల పసుపు, దాల్చిన చెక్క తదితర పంటలను మెక్సికో దేశ బృందం గురువారం పరిశీలించింది. ఈ విధానాన్ని తమ దేశంలోనూ అవలంబిస్తామని మెక్సికో దేశ ప్రభుత్వ ఏరియా డైరెక్టర్ డియాజ్ మరియా నేటివిటీ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంలో డ్రోన్‌తో కషాయాల పిచికారీ



డ్రోన్‌తో కషాయాలు పిచికారీ చేస్తున్న రైతులు

జీలుగుమిల్లి, సెప్టెంబరు 19: ప్రకృతి వ్యవసాయం పద్ధతుల్లో వరిలో చీడపీడల నివారణకు డ్రోన్ ద్వారా కషాయాలు పిచికారీ చేశారు. తాటియాకుల గూడెంలో కేవీకే డీపీఎం తాతారావు ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఎకరానికి మూడు లీటర్ల అగ్ని అస్త్రం, లీటరు నిమాస్త్రంతో ఇంగువ కలిపి పిచికారీ చేశారు. ఆయా విధానాలపై స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. ఆకు మచ్చ, పొడ తెగులు బూజు తెగుళ్లకు ప్రకృతి వ్యవసాయ విధనాల్లో ఉపయోగించే మందులపై రైతులకు ఎంటీ ధర్మరాజు అవగాహన కల్పించారు. సర్పంచ్ వనమ రాంబాబు, పసుపులేటి రాము, కోలా మధు, చిర్రి శ్రీను, రాయి సుబ్బారావు, ఎన్ఎఫ్ఎ హుస్సేన్, వెంటేశ్వరావు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

భూ రికార్డులు పరిశీలించిన ఆర్డీవో అద్దయ్య



భూ రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో

దెందులూరు, సెప్టెంబరు 19: భూ పట్టాల రికార్డులను ఆర్డీవో, భూ రిసర్వే వెరిఫికేషన్ చైర్మన్ కె.అద్దయ్య రివేరిఫికేషన్ గురువారం పరిశీలించారు. తహసీల్దార్ సుమతితో కలిసి షరతుల పట్టాలను పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ మండలంలో భూమి రికార్డుల రివేరిఫికేషన్ ద్వారా పరిశీలించడం జరగుతుందన్నారు. దెందులూరు మండలం తర్వాత పెదవేగి, పెదపాడు మండలాల్లో షరతుల పట్టాల రికార్డుల రివెరిఫికేషన్ చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు కిశోర్, రామకృష్ణ, పజ్జూరి సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర చందనం ఎదురీత

● కొనేవారు లేరు ● దళారుల బెదిరింపులు ● రైతులకు పెట్టుబడి భారం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎర్ర చందనం దుంగలు

టి.నరసాపురం, సెప్టెంబరు 19: మండలంలో ఎర్ర చందనం సాగు చేపట్టిన పలువురు రైతులు పెట్టుబడి భారంతో ఎదురీదుతున్నారు. ఎర్ర చందనం విక్రయానికి ప్రభుత్వం సహకరించి రైతులకు న్యాయం చేయాలని మక్కినవారిగూడెం, కృష్ణాపురం, గంగినీడుపాలెం గ్రామాల రైతులు కోరుతున్నారు. ఎర్ర చందనం సాగుతో లాభాలు వస్తాయనే ఆశతో మండలంలో సుమారు 10 మంది రైతులు 25 ఏళ్ల క్రితం సాగు చేపట్టారు. సుమారు వెయ్యికి పైగా ఎర్రచందనం చెట్లు ఉన్నాయి. అమ్మకానికి సిద్ధంగా ఉన్న చెట్ల కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది దళారులు చెట్లను చూసి వెళుతున్నారని, కొందరు అతి తక్కువ ధరకు బేరమాడుతున్నారని వాపోయారు. మరికొందరు తమకు విక్రయించాల్సిందేనని, తమను కాదని ఎలా అమ్ముతారో చూస్తామంటూ బెదిరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్ర చందనం చెట్లు అమ్మకాలు జరిగితే ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కుతామని భావించామని, ప్రస్తుతం పెట్టుబడి భారం కూడా మోయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి మండలంలో ఎర్ర చందనం సాగుచేసిన రైతుల వద్ద చెట్లు కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు సిరిమళ్ళ సూర్యప్రకాష్, ముళ్ళపూడి రఘురాం, సిరిమళ్ళ వెంకట సత్యనారాయణ తదితరులు కోరుతున్నారు.

ఐదు ఎకరాల్లో సాగు చేశాను : సిరిమల సూర్యప్రకాశరావు



రెండు రాష్ట్రాల్లో మొట్టమొదటగా ఎర్రచందనం సాగు చేసిన రైతుని నేను. నా వద్దనే మొక్కలు కొనుగోలు చేసి పలుచోట్ల సాగు చేస్తున్నారు. 41 సంవత్సరాల క్రితం ఐదు ఎకరాల భూమిలో సుమారు 500 మొక్కలను నాటాను. ప్రస్తుతం 100 మొక్కలు మాత్రమే మిగిలి ఉన్నాయి. పలు కారణాలతో మొక్కలు చనిపోవడం వల్ల తీవ్ర నష్టాలు చవి చూశాను. ఇప్పటికైనా ప్రభుత్వం ఎర్రచందనం రైతులను ఆదుకోవాలి.

లాభదాయకమని భావించాం : ముళ్ళపూడి రఘురాం



ఎర్రచందనం సాగు రైతులకు లాభదాయకమని భావించి సాగుచేశాం. ప్రస్తుతం ఎర్రచందనం చెట్లు రైతుకు భారంగా కనిపిస్తున్నాయి. పలువురు ఎర్రచందనం కొనుగోలుదారులుగా పరిచయం చేసుకున్ని చూసి వెళ్లడం తప్ప కొనుగోలు చేయడం లేదు. కోతకు సిద్ధంగా ఉన్న చెట్లు మార్కెటింగ్ చేసే మార్గం లేకుండాపోయింది. ప్రభుత్వం ఎర్రచందనం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

వరద బాధితులకు దాతల సాయం



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న జయవరపు శ్రీరామమూర్తి

టి.నరసాపురం, సెప్టెంబరు 19: విజయవాడ వరద బాధితులకు పలువురు సాయం అందిస్తున్నారు. టీడీపీ నేతలు గ్రామాల్లో విరాళాలు సేకరించి, కొందరు వ్యక్తిగతంగా నగదు అందజేస్తున్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయ్యవరపు శ్రీరామమూర్తి రూ.లక్ష చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేసినట్లు తెలిపారు. విజయవాడ వరద బాధితులకు చంద్రబాబు అండగా నిలిచారని, ఏ ముఖ్యమంత్రి చెయ్యలేనివిధంగా సాయం అందించారన్నారు. తనవంతు సాయంగా రూ.లక్ష అందించినట్లు తెలిపారు. ఆయన తనయుడు శేఖర్, నవీన్ ఉన్నారు.

● ఏలూరు రూరల్: విజయవాడ వరద బాధితులకు ఏపీ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అండగా నిలిచింది. విజయవాడ సింగ్‌నగర్‌లో వరదలకు ఎలక్ట్రికల్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు 50 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు సిద్ధం చేశారు. నిత్యావసర వస్తువులతో గురువారం బయల్దేరిన వాహనాన్ని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు ప్రారంభించారు. భవననిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా ప్రతి కార్మికుడికి న్యాయం చేస్తామని, ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారని, ఆ హామీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణ, శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరి బత్తిన శ్రీనివాసరావు, కోశాధికారి నాయుడు గంగాధర్‌రావు, తాడిపత్రి బీవోసి అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు, రవిబాబు, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం అందరి కర్తవ్యమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడుకు చెందిన మూల్పూరి శ్రీనిర్మల వరద బాధితుల సహాయార్థం రూ. లక్ష చెక్కును ఎమ్మెల్యే ప్రభాకర్‌కు గురువారం అందించారు. ప్రభాకర్ మాట్లాడుతూ వరద సమయంలో ఆహారం అందించి, ఆకలి తీర్చిన దాతలు ఈరోజున ఆర్థికసాయం అందించి, తిరిగి ఆర్థికంగా కోలుకోవడానికి సహాయపడుతున్నారని చెప్పారు. ఒకవ్యక్తి అందించే సాయం మరోపదిమందికి స్ఫూర్తిగా నిలుస్తుందని, దీంతో వరద బాధితులు పూర్తిస్థాయిలో కోలుకోవడానికి దోహదపడుతుందన్నారు. వరద బాధితులకు విరాళాలందించిన దాతలను ఆయన అభినందించారు. బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు ముంపు బాధితులకు యూటీఎఫ్ సాయం

ఏలూరు అర్బన్: రూరల్ మండలంలోని కొల్లేరు ముంపు బాధితులకు యూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఆనందపురం, కోమటిలంక తదితర గ్రామాల్లో రూ.1200 విలువచేసే నిత్యావసర సరుకులను 80 కుటుంబాలకు అందజేశామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫాఅలీ, రవికుమార్ తెలిపారు. నిత్యావసరాలతోపాటు దుప్పట్లు అందజేశామన్నారు. కోమటిలంక సర్పంచ్ టి.యోహాన్, సుభాషిణి, రంగమోహన్, ప్రసాద్, పిచ్చేడు, మోహన్‌రావు, వివిద మండలాల శాఖల నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చింతమనేనికి విరాళం చెక్కు అందిస్తున్న మహిళ

● ఏలూరు రూరల్: వరద బాధితులను ఆదుకోడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని బిషప్ జాన్ ఎస్‌బి రాజు పిలుపునిచ్చారు. ఏలూరు సిటీ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోమటిలంక, కైకలూరు పరిధిలోని మణుగూరు, ఆనందపురం గ్రామాల్లో ముంపు బాధితులకు గురువారం నిత్యావసర వస్తువుల వాహనాన్ని ప్రారంభించారు. సుమారు 600 కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యోహాను, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







పౌష్టికాహార మాసోత్సవాల భాగంగా జంగారెడ్డిగూడెం, భీమడోలులో సైకిల్ ర్యాలీ, తడికలపూడి అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతం

పౌష్టికాహారంతో పిల్లలకు ఆరోగ్యం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 19: మండలంలోని మైసన్నగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం గురువారం జరిగింది. సెక్టార్ సూపర్‌వైజర్ కె.లక్ష్మి తల్లులకు ఆకుకూరలు, పండ్లు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. కిశోర బాలికలకు రక్తహీనత గురించి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ సింగిదాసు హైమావతి, ఎంపీటీసీ ఎస్.శ్యామల, ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

● భీమడోలు: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పూళ్ళ, ఎంఎం పురం, కురెళ్ళగూడెం జడ్పీ హైస్కూలులో ర్యాలీలు నిర్వహించారు. ఆయా పాఠశాలలోని విద్యార్థినులకు, కౌమార బాలికలకు రక్త హీనత, పౌష్టికాహార లోపం తదితర అంశాలపై జాగ్రత్తలు సూచనలు ఇచ్చారు. విద్యార్థినీ విద్యార్థులతో సైకిల్, నడక ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

● ఏలూరు అర్బన్: కందకం వీధి వార్డు సచివాలయంలో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించనట్లు జిల్లావైద్యఆరోగ్యశాఖ ఏఎన్ఎంల సంఘం నాయకులు జైనాబ్ తెలిపారు. పోషణ మాసోత్సవాల్లో అన్ని వార్డు సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సూపర్‌వైజర్ మీనాక్షి, అంగన్‌వాడీ వర్కర్లు మణి, ఉదయ, విజయ, కళ్యాణి, రూప, సునీత, ఆశ వర్కర్లు రత్నకుమారి, సునీత తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: పోషణ మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తడికలపూడి అంగన్‌వాడీ కేంద్రం వద్ద 19 మందికి సామూహిక సీమంతం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మంగాదేవి, వీరకుమారి గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార అలవాట్లు తెలియజేశారు. ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలంటూ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు, పండ్లు, మందులు అందచేశారు. కార్యక్రమంలో తడికలపూడి సర్పంచ్ కొత్తపల్లి రజిని, పంచాయతీ కార్యదర్శి జీవీసత్యనారాయణ, వీఆర్వోలు మాదు లక్ష్మీనారాయణ, వి.రమేష్, దుర్గారావు, బొంతు వెంకటేశ్వరరావు, బొప్పన అంజియ్య, తూతా లక్ష్మణరావు, పావులూరి గాంధీ, ధర్మలింగేశ్వరరావు, వెంకటరమణ, వెంకటరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

● ఉంగుటూరు: మండలంలోని గొల్లగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆడపిల్లలకు శానిటరీ నాప్‌కిన్‌ల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇవాంజిలిన్, ఆరోగ్య కార్యకర్తలు అనురాధ, ఎం.చంద్రకళ, పాఠశాల హెచ్ఎం అనురాధ, ఎం.డి నయనతార, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో అన్న క్యాంటిన్ ప్రారంభం



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 19: మున్సిపల్ కార్యాలయం వద్ద అన్న క్యాంటిన్ ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వయంగా ప్రజలకు అన్నం వడ్డించారు. అందరితో కలిసి భోజనం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. పేదలు పస్తులుండకూడదనే ఉద్దేశంతో అన్న ఎన్టీఆర్ పేరుతో ప్రారంభమైన క్యాంటీన్లు వందల మంది కడుపు నింపుతున్నాయన్నారు. ఇటీవల నిర్మించిన బుట్టాయగూడెం రోడ్డు, పాత సంత మార్కెట్ నుంచి రావూరి జంక్షన్ వరకు సీసీ రోడ్డు, మున్సిపల్ కార్యాలయ భవనంలో అదనపు గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, కమిషనర్ జె.నరేంద్రకుమార్, తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీవో ఏపీ.ప్రసాద్, దాసరి శ్యామ్‌చంద్ర శేషు, రావూరి కృష్ణ, మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామకుమార్, పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కిశోర్, చెరుకూరి శ్రీధర్, బంగారు శివలక్ష్మి, రాజాన పండు, కౌన్సిలర్లు నంబూరి రామచంద్ర రాజు, వలవల తాతాజీ, కొప్పాక శ్రీనివాసరావు, మహంకాళి రామ్మోహన రావు, తూటిగుంట రాము పాల్గొన్నారు.

రహదారులు పరిశీలించిన ఎమ్మెల్యే చింతమనేని

ఏలూరు రూరల్, సెప్టెంబరు 19: రూరల్ మండలంలో రహదారులను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. కొల్లేరులో పాడైన రహదారులను నిర్మిస్తామన్నారు. తక్షణ చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి పదోన్నతి కల్పించాలని వినతి



నూతన కార్యవర్గ సభ్యులు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 19: మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు హెల్త్ సూపర్‌వైజర్లుగా పదోన్నతి కల్పించాలని ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఈకే ఎన్ జయలక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. అసోసియేషన్ కార్యవర్గ సమావేశం గురువారం నిర్వహించి జిల్లా కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కె.నాగమణి, ఉపాధ్యక్షురాలిగా కె.పద్మజ, ఎం.రేణుక, కార్యదర్శిగా వి.వి నాగలక్ష్మి, జాయింట్ సెక్రటరిగా ధనలక్ష్మి, ట్రెజరర్‌గా జె.మరియమ్మ, వర్కింగ్ అధ్యక్షురాలిగా దేవగలదీప్ ఎన్నిక అయ్యారు. జయలక్ష్మి మాట్లాడుతూ 27ఏళ్లుగా పదోన్నతి లేకుండా మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లుగానే మిగిలిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్లుగా పదోన్నతి కల్పించేందుకు జీవో 143 అమలు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైన నాగమణి మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీలో పీహెచ్ఎన్‌ను నియమించాలన్నారు. కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలు సావిత్రి, కార్యదర్శి కెఎస్.ఎస్ కుమారి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎస్ఐ మృతదేహానికి ఎస్పీ నివాళి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 19: గుండెపోటుతో మరణించిన ఏలూరు సీసీఎస్ ఎస్ఐ డి.నరసింహారావు మృతదేహానికి ఎస్పీ కేపీఎస్ కిషోర్ నివాళులర్పించారు. నరసింహారావు ఈనెల 18న గుండెపోటుతో మృతి చెందారు. ఎస్పీ కిశోర్ గురువారం ఎస్ఐ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎస్పీతో పాటు ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, మల్లేశ్వరరావు, వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్.మురళీకృష్ణ పలువురు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు తగదు



ఎస్పీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నేతల నిరసన

ఏలూరు క్రైం, సెప్టెంబరు 19: కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీకి హాని కలిగించి దేశవ్యాప్తంగా ప్రజాశాంతికి భంగం కలిగించాలని చూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు అన్నారు. వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రామ్మోహనరావు ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం ఎస్పీ ప్రతాప్ శివకిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు తర్వీందర్‌సింగ్ మార్వా, రైల్వే సహాయ మంత్రి రవినీత్‌బిట్టు, రఘురాజ్ సింగ్, షిండే సేన, మహారాష్ట్ర ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ బహిరంగంగానే రాహుల్ గాంధీపై అవాకులు చవాకులు పేలారని, వారికి తగిన బుద్ధి చెపుతామని రాజనాల అన్నారు. రాహుల్‌గాంధీకి హాని తలపెట్టాలని చూస్తే దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ శ్రేణులంతా చూస్తూ ఊరుకోరన్నారు. ప్రజాదరణ కలిగిన నేత రాహుల్ గాంధీపై వ్యాఖ్యలు చేస్తున్న బీజేపీ నాయకులకు రానున్న కాలంలో ప్రజలే తగిన గుణపాఠం చెపుతారన్నారు. పీసీసీ జనరల్ సెక్రటరీ గౌతు సత్యానంద్, దెందులూరు, కైకలూరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఆలపాటి నరసింహమూర్తి, బొడ్డు నోబుల్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంకు శివ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు వేల్పుల వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి



దోసపాడులో సమావేశమైన నేతలు

దెందలూరు, సెప్టెంబరు 19: టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని దోసపాడు గ్రామ కమిటీ నేతలు అన్నారు. దోసపాడులో సర్పంచ్ గోరింక ఏసుమణి, బొల్లె రాము ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ నేత మోదూరి వెంకటేశ్వరరావు, అత్తులూరి శ్రీనివాసరావు మాట్లడతూ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని, పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. మాజీ సర్పంచ్ నెరుసు గంగారాజు, గోరింక ఏసు, దాకారపు ప్రసాద్, బొంతు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న ఎన్డీఏ

టి.నరసాపురం, సెప్టెంబరు 19: కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నారని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు టీవీఎస్ రాజు విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మోదీ, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అనురిస్తున్న ప్రభుత్వాలు కార్మిక వర్గాలకు చేసిందేమీ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని యువతను మోసం చేసిన బీజేపీకి యువకులే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

పాము కాటుతో చికిత్స పొందుతున్న మహిళ మృతి

ఉంగుటూరు, సెప్టెంబరు 19: ఉంగుటూరులో ఈ నెల 18న వల్లూరి ధనలక్ష్మి(47) పాము కాటుతో అస్వస్థతకు గురైంది. ఆమెను తొలుత చేబ్రోలు పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రైవేటు ఆసుపత్రికి తరిలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు అర్బన్** : బాల్యవివాహాల నిరోధంపై ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాలలో చైల్డ్‌లైన్ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. విద్యార్థినులతో బాల్యవివాహ నిరోదంపై ప్రతిజ్ఞ చేయించారు.
- **ఏలూరు రూరల్** : నిరుద్యోగ బ్రాహ్మణులకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి, కూటమిప్రభుత్వం వంద రోజుల్లోనే జీవో విడుదల చేయడంపై ఏపీ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్, కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ హర్షం వ్యక్తం చేశారు.
- పట్టిసీమ ప్రాంతానికి చెందిన కౌలురైతు ఇటీవల పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ కుటుంబానికి విజయవాడ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.వెంకటేశ్వరరావు రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.
- **ఉంగుటూరు** : కైకరం హైస్కూలు ప్రాంగణంలో బెండ తోటలో కూరగాయలతో విద్యార్థులకు వంట చేశారు. హెచ్ఎం ప్రసాదరావు మాట్లాడుతూ పురుగుమందుల అవశేషాలు లేని కూరగాయలను భుజించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.
- **కుక్కునూరు** :కుక్కునూరు, దాచారం గ్రామాల మధ్య గుండేటివాగు కాజ్‌వే రెండు వైపులా ఉన్న అప్రోచ్‌రోడ్డు కొట్టుకుపోయింది. ఇసుక మేటలు తొలగిస్తూ ఆ రహదారి పునరుద్ధరణ పనులు చేపట్టారు.
- అల్లిగూడెం గ్రామానికి చెందిన వీ.రాములు అనే వ్యక్తి తెలంగాణ నుంచి మద్యం తెస్తుండగా పోలీసులు దాడి చేశారు. 37మద్యం బాటిల్స్‌ను ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.
- **కొయ్యలగూడెం** : బయ్యన్నగూడెం పీహెచ్‌సీ డాక్టర్లు సమ్మెలో ఉండడంతో టీడీపీ నేతలు పారేపల్లి నరేష్ రోగులతో మాట్లాడారు. జనసేన నేత తేజ, పారేపల్లి శ్రీనివాస్, నరాల శ్రీను, పాల్గొన్నారు.
- కొయ్యలగూడెం మండలంలోని గవరవరం, చొప్పరామన్నగూడెం గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న జనవాణిలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు టీడీపీ నేత నల్లూరి గోపి తెలిపారు.
- **జంగారెడ్డిగూడెం** : బోసుబొమ్మ సెంటర్‌లో సుభాష్ చంద్రబోస్ విగ్రహ నిర్మాణ పనులు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ గురువారం ప్రారంభించారు. రావూరి కృష్ణ, మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, మహంకాళి రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.
- **ఏలూరు క్రైం** : కోడి వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలను త్రీ టౌన్ ఎస్ఐ జె అజయ్‌కుమార్ సత్రంపాడు వద్ద అడ్డుకున్నారు. నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామానికి జల్లూరి రాజారావు, సైదు వీరవెంకట తాతారావులను అరెస్టు చేశారు. చిన్నత్రంపాడు కేకే చికెన్‌షాపు యజమాని, బిస్మిల్లా చికెన్‌షాపు యజమానిపై కేసు నమోదు చేశారు.
- **నిడమర్రు** : దూరప్రాంత విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్ పాస్‌లు అందించిన దాతలను ఎస్ఐ ఎన్.వీరప్రసాద్ అభినందించారు. దాతలు పేరిచర్ల రాంబాబు, పేరిచర్ల పెద్దిరాజు పాల్గొన్నారు.
- నిడమర్రు మండలం భువనపల్లి మాజీ సర్పంచ్ సంకు వెంకట శేషగిరి రావు (75) గురువారం మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు. ఆయన 1985 నుంచి 1992 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు నివాళులర్పించారు.

పది రోజుల్లో ఆర్టీసీ బస్టాండు రూపు రేఖలు మారుస్తా..

ఆగిరిపల్లి, సెప్టెంబరు 19: తాగుబోతులకు, జూదరులకు, ఆక్రమణలకు నెలవైఉన్న ఆగిరిపల్లి బస్టాండ్‌ను పది రోజుల్లో పూర్తిగా మార్చివేస్తానని, నూజివీడు ఆర్టీసీ డిపో మేనేజరు పవన్‌కుమార్ తెలిపారు. గతంలో తాము మాట ఇచ్చిన ప్రకారం ఆగిరిపల్లి నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సు శుక్రవారం నుంచి నడుపుతామని ఈ బస్సు నూజివీడు, ఖమ్మం, సూర్యపేట మీదుగా బీహెచ్‌ఈఎల్ వరకు నడుస్తుందని, ప్రతిరోజూ సర్వీస్ ఉంటుందని తెలిపారు. బస్టాండును ఆక్రమిస్తున్న ఆటోవాలాలతో చర్చించి బస్టాండు ఆవరణలోకి రావొద్దని హెచ్చరించారు. స్వచ్ఛ హీ సేవాలో భాగంగా నూజివీడు డిపో సిబ్బందిని తీసుకువచ్చి ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి లైట్లను పునరుద్ధరించారు.

విద్యార్థుల పాత్రే కీలకం


అవగాహన కల్పిస్తున్న మేజిస్ట్రేట్ శివపార్వతి

నూజివీడు టౌన్, సెప్టెం బరు 19: బాల్య వివాహాలను నియంత్రించడంలో విద్యార్థులదే కీలక పాత్ర అని నూజివీడు రెండవ అదనపు జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ శివపార్వతి అన్నారు. బాలికోన్నత పాఠశాలలో ప్రముఖ న్యాయవాది నండూరి పద్మాంజలి బసవరాజు రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల నిరోధం, బాలకలకు చట్టపరంగా అంది స్తున్న రక్షణలపై న్యాయమూర్తి వివరించారు. న్యాయవాది నండూరి పద్మాంజలి గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. లీటల్ వలంటీర్‌గా ఎం.ఉమా వ్యవహ రించారు. హెచ్‌ఎం సత్యనారాయణ, న్యాయవాది జాన్‌బాబు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ శుభశేఖర్

ఆగిరిపల్లి, సెప్టెంబరు 19: ఎంవీఎన్ అండ్ వైవీఎన్ జూనియర్ కళాశాలను సబ్ ఇనస్పెక్టర్ శుభశేఖర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సత్ ప్రవర్తనతో నడవాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటివల్ల కుటుంబాలు ఎలా క్షీణిస్తాయో తెలిపారు. మహిళలపై లైంగిక దాడులకు పాల్పడేతే చట్టం ప్రకారం ఎటువంటి చర్యలు ఉంటాయో వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కె.యోహాన్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్‌గా 'బొట్టు'



చాట్రాయి, సెప్టెంబరు 19: కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్‌గా చీపురుగూడెం గ్రామానికి చెందిన బొట్టు రామ చంద్రరావు రెండో సారి ఎన్నికయ్యారు. విజయవాడలో బుధవారం ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఇటీవలే ఆయన పదవీ కాలం పూర్తి కావడంతో తిరిగి ఎన్నికయ్యారు. గతంలో రామచంద్రరావు సర్పంచ్, చిన్నంపేట పీఏసీఎస్ అధ్యక్షుడు, మండల టీడీపీ అధ్యక్షుడు, పాల సంఘం అధ్యక్షుడు మొదలైన పదవులు నిర్వహించారు. తాను తిరిగి ఎన్నిక కావటానికి సహరించిన మంత్రి పార్థసారథి, చైర్మన్ చలసాని అంజనేయులు, పాల సంఘాల అధ్యక్షులు, రైతులకు బొట్టు ధన్యవాదాలు తెలిపారు.

రక్షణ సైన్యం సంస్థ ఆవిర్భావ దినోత్సవం

ముసునూరు, సెప్టెంబరు 19: రక్షణ సైన్యం సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ముసునూరులో ఘనంగా నిర్వహించారు. రక్షణ సైన్యం చర్చ్ వద్ద పాస్టర్ ఎం.రాజు, వనిత దంపతులు సంస్థ జెండాను ఆవిష్కరించారు. తొలుత క్రైస్తవభక్తి గీతాలను సంఘ విశ్వాసకులు ఆలపించారు. పాస్టర్ రాజు మాట్లాడుతూ రక్షణ సైన్యం సంస్థ భారతదేశానికి వచ్చి 143 ఏళ్లయిందని, ప్రస్తుతం 152 దేశాల్లో పని చేస్తోందన్నారు. అనంతరం మిఠాయిలను పంచారు. వేల్పుచర్ల, గోపవరం, పెద్దపాటివారిగూడెం, కాట్రేనిపాడు గ్రామాల్లో రక్షణ సైన్యం సంస్థ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘ పెద్దలు యాకోబు, రవి, యువరాజు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


కైకలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు

ముసునూరు, సెప్టెంబరు 19: పోషక విలువలతో కూడిన ఆహారం సమపాళ్లలో తీసు కోవడం వల్ల గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంగా ఉంటారని నూజివీడు ఐసీడీఎస్ సీడీపీవో ఎస్‌వై నురానీ అన్నారు. చెక్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు కాటేపల్లి పుష్పావతి శ్రీనివాసరావు, సీడీపీవో, ఏసీడీపీవో నాగేశ్వరి, టీడీపీ నాయకులు తోట ప్రభాకర్‌రావు సీమంతం చేశారు. వివిధ రకాల పోషక ఆహార పదార్థాలను ప్రదర్శించారు. బాలింతలకు వైద్య సిబ్బంది హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. అలాగే కాట్రేనిపాడు తదితర గ్రామా ల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై కిషోర బాలికలు, గర్భిణులకు ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ ధనలక్ష్మి, ఏఎన్ ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి : బొద్దనపల్లి ఎంపీయూపీ పాఠశాలలో గురువారం కిషోర బాలికలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. రక్తహీనతకు గల కారణాలు, లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన ఐరన్ నిల్వలు ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాల గురించి వివరించారు. హ్యాండ్ వాష్ గురించి, వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలియచేసి కార్యక్రమం అనంతరం బాలికలతో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ రాగమయి పాల్గొన్నారు.

● కైకలూరు : పోషకాహార మాసోత్సవాల సందర్భంగా కైకలూరు వెలమపేట ఎంపీయూపీ స్కూల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం పాఠశాలలో విద్యార్థులకు రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉప్పుటేరును ప్రక్షాళన చేయాలి



కలిదిండిలో రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

కలిదిండి, సెప్టెంబరు 19 : వరద ముంపు నుంచి కొల్లేరు గ్రామాలను, ఆక్వా రైతులను కాపాడాలంటే ఉప్పుటేరును ప్రక్షాళన చేయాలని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కలిదిండి మార్కెట్ యార్డు ఆవరణంలో టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు అధ్యక్షతన గురువారం రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పుటేరు ఆక్రమణకు గురికావడం వలనే కొల్లేరులో వరద నీరు ఉప్పుటేరులోకి పూర్తిగా ప్రవహించకపోవడంతో గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయన్నారు. దట్టంగా ఉన్న కిక్కిస, గుర్రపు డెక్కలను తొలగించాలన్నారు. కాల్వలు, డ్రెయిన్లు గట్లు బలహీనంగా ఉండడంతో గండ్లు పడి గ్రామాలు పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయన్నారు. కాల్వల్లో గుర్రపు డెక్క, కిక్కిస ఉండటంతో సాగు, తాగునీరు శివారు గ్రామాలకు పారటం లేదన్నారు. శాశ్వత సమస్య పరిష్కారానికి రూ.55 లక్షలతో పొంటి ఏర్పాటు చేసి కాల్వలు, డ్రెయిన్లు పూడికతీయడంతో పాటు గట్లును బలపర్చటానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. రొయ్యల ఫ్యాక్టరీల్లో కలుషిత నీరు ఉప్పుటేరులోకి వదలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉప్పుటేరు ప్రక్షాళన చేయటానికి చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానా యుడును ఫోన్‌లో కోరగా, అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. చేపల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాడినాడ బాబు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్, జడ్పీటీసీ బొర్రా సత్యవతి, మాజీ జడ్పీటీసీ నున్న రామాదేవి, మాజీ ఎంపీపీ వలవల రామారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు చిట్టూరి రవీంద్ర, డీసీ మాజీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ, జనసేన నాయకులు నల్లగోపుల చలపతిరావు, బట్టు లీలా కనకదుర్గ, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై మండిపాటు

మండవల్లి : వైద్య సిబ్బంది విధి నిర్వాహణలో సమయ పాలనలో విధి విధానాలు పాటించకుంటే సహించేది లేదని ఎమ్మెల్యే శ్రీనివాస్ హెచ్చరించారు. మండవల్లి పీహెచ్‌సీని గురువారం ఆయన సందర్శించారు. రోగులతో వైద్య సిబ్బంది అవలంబిస్తున్న నిర్లక్ష్యం వైఖరిని ఎన్డీఏ నాయకులు గుడివాడ చిట్టిబాబు, బండి రంగారావు, మరికొంతమంది కామినేనికి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వైద్య సిబ్బందిపై కామినేని మండిపడ్డారు. పనిచేయడం ఇష్టం లేకపోతే పొరుగు ప్రాంతాలకు వెళ్లిపోవాలని మందలించారు. ఇటువంటి ఫిర్యాదు మరలా తన దృష్టికి రాకుదన్నారు. వైద్యులు ఏమయ్యారని ప్రశ్నించారు. శ్రద్ధ లేనప్పుడు బదిలీ చేయించుకుని పొమ్మని కామినేని వెల్లడించారు. అనంతరం శ్రీషిర్డి సాయిబాబా మందిరంలో బాబాని దర్శించుకుని బీజేపీ సభ్యత్వాలు నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వేంపాటి విష్ణు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ, బీజేపీ మండవల్లి మండల ప్రెసిడెంట్ సమయం ఏసుబాబు, గడివాడ చిట్టిబాబు, కీర్తి రాంప్రసాద్, గంగునేని వరప్రసాద్, లింగాల బోయిడి సురేష్, శ్యామలరావుగౌడ్, బండి దివాకర్ పాల్గొన్నారు.

● కైకలూరు : యూపీ స్కూల్ ఎదురుగా ఉన్న కార్తికేయ మినీ ఫంక్షన్ హాలులో బీజేపీ సభ్యత్వాలపై కైకలూరు, మండవల్లి మండలాల్లోని కొల్లేరు గ్రామాల పెద్దలతో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీలో సభ్యత్వం తీసుకోవాలన్నారు. రాష్ట్ర వడ్డీసాధికారిక సమితీ కన్వీనర్ బలే ఏసురాజు, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసలు పాల్గొన్నారు.

అసైన్డు భూముల జాబితాను పునఃపరిశీలించండి

అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశం



కలిదిండి, సెప్టెంబరు 19 : రిజిస్ట్రేషన్ ప్రక్రియకు పంపించిన అసైన్డు భూముల జాబితాను పునఃపరిశీలించాలని నూజివీడు సబ్ కలెక్టర్ వై.భవానీ శంకరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలిదిండి తహసీల్దార్ కార్యాల యాన్ని గురువారం సందర్శించి అసైన్డు భూముల రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ 20 ఏళ్లు పూర్తి చేసుకున్న అసైన్డు పట్టాదారులకు మాత్రమే వారి భూమిని రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. చేతులు మారిన అక్రమ సాగుదారుల కు రిజిస్ట్రేషన్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలిదిండి మండలంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన 254 ఎకరాల అసైన్డు భూముల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేయాల న్నారు. తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు పాల్గొన్నారు.

లడ్డూ వేలంలో పోలీసులు



ముదినేపల్లి, సెప్టెంబరు 19 : గ్రామంలోని వైజంక్షన్ వినాయకుడి లడ్డూను ముదినేపల్లి పోలీసులు రూ.3,501లకు వేలంతో పాడుకున్నారు. గురువారం జరిగిన లడ్డూ వేలంలో ఎస్ఐ వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పాల్గొని హెచ్చు ధరకు పాడుకున్నారు. ముదినేపల్లి ప్రాంతంలో వినాయకుడి లడ్డూ వేలంలో పోలీసులు పాల్గొనటం ఇదే ప్రథమం. ఇదిలా ఉండగా, పెదపాలపర్రు, గురజలో గణేష్ నిమజ్జనోత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారంతో మండలంలోని 86 విగ్రహాల నిమజ్జనాలు పూర్తయ్యాయని ఎస్ఐ తెలిపారు.

వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు


మంత్రి పార్థసారథికి రూ.1.5 లక్షల చెక్కు అందజేస్తున్న జంగంగూడెం సర్పంచ్


మండవల్లిలో ఎమ్మెల్యే కామినేనికి రూ.లక్ష చెక్కు అందజేస్తున్న బాబి



మండవల్లి ఆనందాపురం గ్రామంలో కొల్లేరు వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 19: విజయవాడ వరద బాధితులకు జంగంగూడెం గ్రామవాసుల సహకారంతో రూ.1.5 లక్షలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు గురువారం అందించారు. నూజివీడులో మంత్రి క్యాంప్ ఆఫీసులో సమచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి గ్రామ సర్పంచ్ అంజనీకుమారి చెక్కును ఆయన అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు చూపిన సేవా నిరతిని అభినందించారు. టీడీపీ నాయకులు వల్లభనేని భాస్కర్, వల్లభనేని నల్లబాబు, ప్రముఖులు పొట్లూరి అశోక్, వల్లభనేని సుబ్బారావు, వాణి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● మండవల్లి : వరద బాధితులకు భైరవపట్నం ఎన్డీఏ నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, సజ్జా బాబి రూ.లక్ష, చెక్కును, పసలపూడి గ్రామస్తులు గన్నమనేని సుధాకర్ రూ.లక్ష చెక్కును, లింగాల గ్రామానికి చెందిన పాలూరు ప్రముఖులు రూ.1.25 లక్షల, మండవల్లి మండల సమైఖ్య సంఘం ఆధ్వర్యంలో రూ.79,999లను గురువారం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కి అందజేశారు. బుక్ కీపర్స్ కొల్లేరు ముంపునకు గురైన తమ తోటి బుక్కీ కీపర్లకు గ్రామ సంఘాల ప్రెసిడెంట్లకు నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే కామినేని చేతుల మీదుగా పంపిణీ చేశారు.

మూడు తాళ్ళపాడు పంచాయతీ పరిధిలోని ఆనందపురంలో కొల్లేరు వరద బాధిత కుటుంబాలకు యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్తాఫా ఆలీ, రవికుమార్, రుద్రాక్షి, రాష్ట్ర కార్యదర్శి బి సుభాషిని, జిల్లా కోశాధికారి జీవీ రంగమోహన్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్ గారు ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.మోహనరావు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సీహెచ్ స్వర్ణరేఖ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పిచ్చేడు, మండవల్లి కైకలూరు మండల నాయకత్వం పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞలు


ఆగిరిపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

ఆగిరిపల్లి, సెప్టెంబరు 19: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం ఎంపీడీవో కార్యాలయ పరిసరాలను అధికారులు, సిబ్బంది శుభ్రం చేశారు. ఎవరికైనా చెప్పేముందు తాము శుభ్రంగా ఉండాలని, అందుకే తమ కార్యాలయం శుభ్రం చేసుకుంటున్నామని, ఇన్‌చార్జి ఎంపీడీవో అబ్దుల్‌సలామ్ తెలిపారు. అనంతరం స్వచ్ఛత పై ప్రతిజ్ఞ చేశారు.

● ముదినేపల్లి : స్వచ్ఛత హి సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం ముదినేపల్లి మండలంలో స్వచ్ఛతా ప్రతిజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులతో తాము గ్రామాల పరిశుభ్రతకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కొన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు.


ముదినేపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు

నేటి నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

నూజివీడు, సెప్టెంబరు 19: నియోజకవర్గ క్రీడా పోటీలను ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నతపాఠశాలలో నేడు ప్రారంభించనున్నట్లు నూజివీడు బాలుర ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుని హేమలత తెలిపారు. ఆగిరిపల్లి, ముసునూరు, నూజివీడు, చాట్రాయి మండల బాలుర క్రీడాకారులు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడాంశాల్లో సీనియర్, జూనియర్ విభాగాల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలోని క్రీడాప్రాంగణాలను క్రీడలకు సంసిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అన్నామణి, వనజ, రవీంద్ర, నాగరాజు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం


ఆటల పోటీలు ప్రారంభిస్తున్న చిట్టిబాబు

చాట్రాయి, సెప్టెంబరు 19: మర్లపాలెం హైస్కూల్ ఆవరణలో గురువారం మండల స్థాయి ఆటల పోటీలు, టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహించారు. ఆటల పోటీలను సర్పంచ్ ఎం.చిట్టిబాబు ప్రారంభించగా, మర్లపాలెం, చిత్తపూరు హైస్కూల్స్ పీడీలు సతీష్‌కుమార్, ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేత జట్టు నియోజకవర్గ స్థాయిలో ఆడతారని పీడీలు చెప్పారు. నూజివీడు సబ్ జోన్ సెక్రటరీ సుగుణరావు, హెచ్ఎం బక్కయ్య, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీలత, ఎస్ఏ తిరుపతయ్య పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కైకలూరు, సెప్టెంబర్ 19: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ సబ్జెక్టు అతిథి అధ్యాపకుని పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తా మని ప్రిన్సిపాల్ ఎస్.శాంతిజ్యోతి తెలిపారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంకాం కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణు లై ఉండాలన్నారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారానికి సెల్ నెంబరు 94949 11486లో సంప్రదించాలని కోరారు.

పాఠశాలల నిర్వహణ బాధ్యత హెచ్‌ఎంలదే


గురజ ఎలిమెంటరీ పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవో-1 సేవ్యా నాయక్

ముదినేపల్లి, సెప్టెంబరు 19 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన కార్యక్రమాలను పాఠశాలల్లో అమలు చేసేందుకు ప్రధానోపాధ్యాయులు ప్రధాన బాధ్యత తీసుకోవాలని ముదినేపల్లి ఎంఈవో-1, నూజివీడు ఇన్‌చార్జి డీవైఈవో సేవ్యా నాయక్ తెలిపారు. గురజ-1 ఎలిమెంటరీ పాఠశాలను గురువారం ఆయన సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు, ఇతర బోధనా కార్యక్రమాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. అకడమిక్ కార్యక్రమాలపై హెచ్‌ఎంలతో ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. హెచ్ఎం సరోజ పాల్గొన్నారు. పెదపాలపర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.

పాఠశాలల పరిశీలన

శ్రీహరిపురంలోని ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ పామర్తి అంజలీదేవి, కార్యదర్శి అప్పారావు గురువారం పరిశీలించారు. పాఠశా లల్లో విద్యార్థులకు మోనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తు న్నారా లేదా భోజనంలో ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు పోషకాహారం అందించటంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

హెచ్‌ఎంపై దారి తప్పిన విచారణ


విచారణాధికారికి తన వివరణ ఇస్తున్న సర్పంచ్ రాకేష్

ముదినేపల్లి, సెప్టెంబరు 19 : పెదపాలపర్రు హైస్కూల్‌లో పలు అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై సస్పెండ్ అయి, ప్రస్తుతం మండవల్లి మండలం ఇంగిలిపా కలంక జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎంగా ఉన్న శాంతకుమారిపై విచారణ దారి తప్పింది. గతంలో పెదపాలపర్రు హైస్కూల్‌లో ఆమె వచ్చిన వివిధ అభియోగాలపై ప్రాథమికంగా విద్యా శాఖ అధికారులు విచారణ జరిపి ఆమెను ఈ ఏడాది జూన్ 21న సస్పెండ్ చేశారు. విచారణ పూర్తి చేయకుండానే రెండు నెలల క్రితం తిరిగి పోస్టింగ్ ఇచ్చారు. హెచ్ఎం శాంతకుమారిపై సమగ్ర విచారణ చేయాలని ఉన్నతాధికారులను పలువురు డిమాండ్ చేసిన నేపథ్యంలో గురువారం పెదపాలపర్రు హైస్కూల్‌లో విద్యా శాఖ ఆర్‌జేడీ ఆదేశాల మేరకు డీఈవో కార్యాలయ అధికారులు విచారణ చేపట్టారు. అయితే ఈ విచారణలో పలు నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. హెచ్ఎం ను విచారించేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించలేదన్న విషయం స్పష్టమైంది. ఆరోపణలను ఎదుర్కొంటున్న హెచ్ఎం వద్ద సంజాయిషీ తీసుకోకుండా ఆరోపణలు చేసిన సర్పంచ్ రాకేష్ ఎస్ఎంసీ చైర్మన్ నరసింహమూర్తి, విద్యార్థులు, హెచ్ఎం పాం దురంగారావు వద్ద మాత్రం విచారణ పత్రాలను తీసుకున్నారు. ఇందులో విద్యాశాఖ అధికారుల డొల్లతనం కూడా బయట పడింది.

జరిగిందిలా..

గురువారం ఉదయం హెచ్ఎం శాంతకుమారిపై విచారణ నిర్వహించేందుకు విచారణాధికార్లుగా నియమితులైన ఏలూరు డీఈవో కార్యాలయం ఏడీ అవధాని, నూజివీడు డీవైఈవో సేవ్యా నాయక్‌తోపాటు డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్లు పవన్, మోహన్ పెదపాలపర్రు స్కూలుకు వచ్చారు. అనంతరం ఆరోపణలు ఎదుర్కొంటున్న హెచ్ఎం శాంతకుమారి విచారణకు హాజరు కాగా, ప్రధానమైన నాడు - నేడు పనులకు సంబంధించిన ఆరోపణలను పక్కన పెట్టి విచారణాధికారులు ఇతర అంశాలకు సమాచారాన్ని ఇవ్వాలని ఒక ప్రశ్నావళి పత్రం చూపించారు. ఆ పత్రం చూసిన ఆమె తాను తనకు సహాయంగా ఒక రిటైర్డ్ ఎంఈవోను తీసుకొస్తానని చెప్పగా, అందుకు అధికారులు అంగీకరించలేదు. దీంతో విచారణ హాలు నుంచి బయటికి వెళ్లిపోయి తిరిగి రాలేదు. కొంతసేపు అధికారులు వేచి చూసినా ఆమె రాకపోగా, తాను అనారోగ్యంతో గుడివాడ ప్రభుత్వాస్పత్రిలో చేరానని విచారణాధికారి సెల్‌కు మెస్సేజ్ వచ్చింది. దీంతో అధికారులు గుడివాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లగా ఆమె వారికి కనిపించలేదు.

ఆర్‌జేడీకి నివేదిక

గురువారం నాటి విచారణ సందర్భంగా జరిగిన పరిణామాలపై ఆర్‌జేడీకి నివేదిక అందజేస్తామని విచారణాధికారి అవధాని తెలిపారు. ఆమె వ్యవహరించిన తీరుపై కూడా నివేదిక ఇస్తామన్నారు. హెచ్‌ఎంను విచారించేందుకు గుడివాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లగా, ఆమె జాయిన్ కాలేదని తెలిసిందన్నారు.

తమ్ముడి భార్యపై కన్నేసిన అన్న

» సర్దుకుపోవాలంటూ చిన్న కోడలికి అత్త హితవు

» లొంగకపోయే సరికి తమ్ముడు, మరదలిపై దాడి

నూజివీడు/నూజివీడు టౌన్, సెప్టెంబరు 19 : తను ఏం చేసినా వెనకేసుకుని వచ్చే తల్లి.. తమ్ముడి నిస్సహాయత, మరదలి అమాయకత్వం.. వెరసి అతనిలో కీచకుడు బయటకు వచ్చాడు. ఏదో రకంగా తన మరదలిని లొంగదీసుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేశాడు. లొంగకపోయే సరికి వారిద్దరిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గాయపడిన వారిద్దరిని చికిత్స నిమిత్తం నూజివీడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలివి.. ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన కలిదిండి సత్యనారాయణ ప్రసాద్ కుమార్తె దివ్యకు ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం పెదవెలమిల్లికి చెందిన దేవిన వెంకటేశ్‌కు తొమ్మిది నెలల క్రితం వివాహమైంది. వెంకటేశ్ అన్న వీరభద్రం దివ్యపై లైంగిక వేధింపులకు దిగుతున్నాడు. దీనిని గుర్తించిన వెంకటేశ్ తన సోదరుడి వ్యవహార శైలిపై అభ్యంతరం చెబుతూ తల్లి దేవిన మణికుమారికి తెలిపాడు. దీనికి ఆమె 'భార్య లేని వాడు కదా.. ఏం చేస్తాడు. పాండవులు ద్రౌపదిని చేసుకోలేదా ? మీరిద్దరే కదా ఇంటి విషయాల్లో సర్దుకుపోవాలి' అంటూ పెద్ద కుమారుడు వీరభద్రాన్ని వెనకేసుకుని రావడంతో అతను నిర్ఘాంతపోయాడు. వెంకటేశ్ తమ పరిస్థితిని అత్త మామలైన సత్యనారాయణ, జ్యోతిలకు తెలిపాడు. అయినప్పటికీ పరిస్థితులు చక్కబడకపోగా వేధింపులు మరింత పెరిగాయి. వీరభద్రం పలుమార్లు దివ్యపై విచక్షణారహిత దాడికి దిగేవాడు. ఈ క్రమంలో శుక్రవారం తమ్ముడు, మరదలిపై అతను మరోసారి దాడి చేయడంతో వారు ఇంటి నుంచి బయటపడి నిడదవోలు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. విషయం తెలిసిన మామ సత్యనారాయణ కూతురు, అల్లుడిని నూజివీడు తీసుకువచ్చి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరి ఒంటిపై పలుచోట్ల తీవ్రగాయాలు ఉండటంతో చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించి, జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దాడికి దిగి రోజులు గడుస్తున్నా నిందితులపై చర్యలు మాత్రం కానరాకపోవడంతో తన కూతురు, అల్లుడికి న్యాయం చేయాల్సిందిగా సత్యనారాయణ కోరుతున్నాడు.

క్రైం కార్నర్..

చికిత్స పొందుతూ వడ్రంగి మేస్త్రీ మృతి


కొండపర్వ సత్తిబాబు (ఫైల్‌ఫొటో)

ముసునూరు, సెప్టెంబరు 19: మండలంలోని లోపూడి గ్రామానికి చెందిన వడ్రంగి మేస్త్రీ కొండపర్వ సత్తిబాబు (45) గురువారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నెల 13న లింగ పాలెం మండలం ధర్మాజీగూడెంలో ఒక ఇంటివద్ద రేకుల షెడ్డు వేసేందుకు వెళ్లిన సత్తిబాబు ప్రమాదవశాస్తు కిందపడడంతో తలకు బలమైన గాయమైంది. అయితే గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో గత వారం రోజులుగా చికిత్స పొందుతున్న సత్తిబాబు గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చేతిపని వృత్తిలో నైపుణ్యం కలిగిన వ్యక్తిగా, అందరితో కలివిడిగా ఉంటూ మంచి పేరు ఉన్న సత్తిబాబు ప్రమాదవశాస్తు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

బాలుడికి గాయాలు



నూజివీడుటౌన్, సెప్టెంబరు 19: గొల్లపల్లి గ్రామంలో ప్రయివేటు స్కూల్ బస్సు తగిలి గొల్లప ల్లి గ్రామానికి చెందిన మాధవ సాయి అనే విద్యార్థి గాయాల పాలయ్యాడు. అయితే పాఠశాల యాజమాన్యం గాయపడిన విద్యార్థిని నూజివీడులోని ప్రయివేటు వైద్యశాలలో చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది.

భార్యను హింసించిన భర్తపై కేసు నమోదు

కలిదిండి, సెప్టెంబరు 19 : భార్యను హింసించిన భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. పడమటిపాలెం గ్రామానికి చెందిన పి.దుర్గ (28) ఈ నెల 16న పుట్టింటికి వెళ్లి వచ్చింది. దీంతో కోపోద్రేక్తుడైన భర్త రామాంజనేయులు దుర్భాషలాడుతూ భార్య దుర్గను హింసిస్తూ చితకబాదాడు. తీవ్ర గాయాల పాలైన దుర్గ కైకలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుంది. భార్య ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


నీలపాల శంకర్ (ఫైల్)

ముసునూరు, సెప్టెంబరు 19: మండలంలోని గోగులంపాడు శివారు కొత్తూరుకు చెందిన నీలపాల శంకర్(48) బుధవారం తెల్లవారుజాము నుంచి కనిపించకపోవడంతో గురువారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులు ముసునూరు పోలీసులకు ఫిర్యా దు చేశారు. శంకర్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితులతో గత కొన్నినెలలుగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున పొలంలోకి వెళ్లివస్తానని చెప్పి వెళ్లిన శంకర్ తిరిగి రాలేదు. శంకర్ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో శంకర్ తమ్ముడు నీలపాల లక్ష్మణరావు, ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యవసాయ బోర్లు సామగ్రి చోరీ


గోపవరంలో కట్ చేసిన బోరు కేబుల్ వైరు

ముసునూరు, సెప్టెంబరు 19: మండలంలోని గోపవరంలో వ్యవసాయ బోర్లకు సంబంధించిన సామగ్రి బుధవారం రాత్రి చోరీకి గురైంది. గుర్తుతెలియని వ్యక్తులు సుమారు తొమ్మిది మంది రైతులకు సంబంధించిన వ్యవసాయ బోర్లు కేబుల్ వైరు, ఫీజుల్లో రాగివైరు, స్టాటర్లలో ఉన్న రాగి వైరును సైతం దొంగిలించుకుపోయారు. ఒక్కొక్కబోరుకు సంబంధించిన సామగ్రి విలువ సుమారు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఉంటుం దని బాధిత రైతులు కర్రా వెంకటేశ్వరరావు, కర్రా సూరిబాబు, గోధుమ నక్షత్రం తదితరులు వాపోయారు. ఈ చోరీలపై రైతులు గురువారం ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.